
మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 155 | కర్నూలు | బుధవారం జూలై 02 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







# పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం

**ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వండతో ప్రజల్లో ఆనందం**
**గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదు**
**వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ఎప్పుడూ చూడలేదు**
**నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటన**
**మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**







రాజమండ్రి,జులై 1(శ్రీచక్ర) పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని.. ఈ కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వటం వల్ల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నూటికి 13 మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని అన్నారు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతామని' వెల్లడించారు. పెరిగిన ఆదాయం పేదలకు పంచి అభివృద్ధికి ఖర్చు పెడతామని చెప్పుకొచ్చారు. తన తల్లి పడిన కష్టం ఏ మహిళకూ ఉండకూడదని ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు చంద్రబాబు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

పింఛన్లు ఇచ్చేటప్పుడు ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో పేదవారిని చులకనగా చూస్తే సహించనని హెచ్చరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టపడుతున్నానని తెలిపారు. మానవత్వంతో దివ్యాంగుల కోసం 12 రెట్లు పింఛన్లు పెంచామన్నారు. రాజకీయ ముసుగు వేసుకొని ప్రజాధనాన్ని దోచుకుంటే సహించనని వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీయే కార్యకర్తలు దగ్గరుండి మరీ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పరిశీలించాలని ఆదేశించారు. 'డ్రగ్స్, గంజాయి విక్రయించే వారి తాట తీస్తా. ఆడబిడ్డపై చేయివేసే వారికి అదే చివరి రోజు. రౌడీయిజాన్ని సహించను' అని తీవ్రంగా హెచ్చరించారు. 'సాధారణ కుటుంబంలో పుట్టి దేవుని కృప వల్ల అంచెలంచెలుగా అభివృద్ధి చెందాం. డాక్టర్ అంబేడ్కర్ సాధారణ కుటుంబం నుంచి జన్మించి తరతరాలు గుర్తుండే రాజ్యాంగాన్ని రచించారు. లక్ష బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. రూ.10లక్షల కోట్ల అప్పులు తీర్చాలని' అన్నారు. పోలవరాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని 2027కి పూర్తి చేసే అదృష్టం దేవుడు తనకే ఇచ్చారన్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యం

**మనమే ఐదు సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలి**
**బిజెపి అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణలో కేంద్రమంత్రి వర్మ**
**పార్టీ కోసం తనవంతుగా కష్టపడి పనిచేశానన్న పురందేశ్వరి**



విజయవాడ,జూలై 1(శ్రీచక్ర) డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. కూటమి నేతలతో సమన్వయం చేస్తూనే.. ఏపీ బీజేపీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని.. మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. మంగళవారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడారు. ఏపీ బీజేపీ రథసారథిగా ఎంపికైన పీవీఎన్ మాధవ్‌కు శ్రీనివాస వర్మ శుభాకాంక్షలు తెలిపారు. పురంధేశ్వరి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పార్టీ కోసం ఎంతో పనిచేశారని శ్రీనివాస వర్మ కొనియాడారు. తాను ఎంపీగా, కేంద్రమంత్రిగా పురంధేశ్వరి సహకారంతో ఎదిగానని ఉద్ఘాటించారు. పీవీఎన్ మాధవ్ కూడా నిత్యం పార్టీ కోసం పని చేస్తారని అన్నారు. మాధవ్ తండ్రి చలపతిరావు కూడా పార్టీ కోసం పరితపించే వారని గుర్తుచేసుకున్నారు. అప్పటి నాయకులకు చలపతిరావు సేవల గురించి తెలియదని చెప్పారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి చలపతిరావే అని గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన మాధవ్ కూడా సొంతంగా ఎదిగారని కొనియాడారు. మాధవ్ ఏపీ బీజేపీని బలోపేతం చేస్తారనే నమ్మకం తమకు ఉందని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేసేలా పీవీఎన్ మాధవ్ చూడాలని కోరారు. కింది స్థాయి కార్యకర్తలతో మాట్లాడి.. వారి సమస్యలు పరిష్కరించేలా మాధవ్ పని చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సూచించారు. ఇకపోతే రాజకీయాల్లో స్వలాభాపేక్ష ఏ రోజూ తాను చూసుకోలేదని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప.. తన రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదన్నారు.

తనను ప్రోత్సహించిన, ప్రతిఘటించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని తాను ఆశిస్తున్నానని ఎంపీ పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికయ్యారు. బీజేపీ జెండాను మాధవ్‌కు ఇచ్చి.. పార్టీ బాధ్యతలను పురంధేశ్వరి అప్పగించారు. మాధవ్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పురందేశ్వరి మాట్లాడారు. '2013లో బీజేపీలోకి నేను వచ్చాను. బీజేపీలోకి వచ్చిన నాటి నుంచి నాకు పార్టీ గౌరవం ఇస్తోంది. అన్ని విధాలుగా నాకు గౌరవం ఇచ్చిన పార్టీకి కృతజ్ఞతలు. పీవీఎన్ మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట యోధులు. చలపతిరావు నుంచి పట్టుదల, ఎలా ముందుకు వెళ్లాలో నేర్చుకున్నాను. వెంకయ్య నాయుడు నుంచి చనువు, చొరవ నేర్చుకున్నాను. ఏపీ బీజేపీకి జీవితం అంకితం చేసిన నాయకుల నుంచి నేను చాలా నేర్చుకున్నా.

# మరోమారు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర

**కూటమి అక్రమాలను ఎండగట్టడమే లక్ష్యం**
**వైసీపీ యూత్ వింగ్‌తో భేటీలో జగన్ ప్రకటన**

అమరావతి,జులై 1(శ్రీచక్ర) : మరోమారు రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి అధికార కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తానని వైకాపా అధినేత జగన్ ప్రకటంచారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలవడానికి ప్రధాన కారణాల్లో వైఎస్ జగన్ సుదీర్ఘ పాదయాత్ర ఒకటి అని నిస్సందేహంగా చెప్పచ్చు. 3 వేల 648 కిలోమీటర్ల మేర 341 రోజులు జరిగిన ఈ పాదయాత్ర ఒక ట్రెండ్ సెట్టర్ అని చెప్పాలి. ఈ పాదయాత్రకు వచ్చిన రెస్పాన్స్ అప్పట్లో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు మళ్ళీ అదే సీన్ రిపీట్ కానుందని తెలుస్తోంది. 2029 ఎన్నికలకు ముందు మరోసారి పాదయాత్ర చేస్తానని ప్రకటించారు జగన్. మంగళవారం తాడేపల్లిలో వైసీపీ యూత్ వింగ్ తో భేటీ అయినా జగన్ ఈమేరకు సంచలన నిర్ణయం ప్రకటించారు. యూత్ వింగ్ పార్టీలో క్రియాశీలకమైందని.. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువతది కీలక పాత్ర అని అన్నారు జగన్. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని.. లీడర్లుగా ఎదిగేందుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే గొప్ప అవకాశం ఉంటుందని అన్నారు జగన్. వచ్చే ఎన్నికలకు ముందు ఎలాగో తన పాదయాత్ర ఉంటుందని.. అప్పుడు సోషల్ మీడియా యాక్టివిస్టులు ప్రతి ఒక్కరిని పేరుపేరునా పిలిచి కలుస్తానని అన్నారు జగన్. పార్టీ పెట్టిన కొత్తలో అందరూ కొత్తవాళ్లే అని..



అప్పట్లో పార్టీలో తాను, తన తల్లి మాత్రమే ఉన్నారని, తన మీద వ్యక్తిగతంగా అభిమానం ఉన్నవాళ్లు పార్టీలోకి వచ్చారని జగన్ అన్నారు. పార్టీ పెట్టడంతోనే తన ప్రస్థానం మొదలైందని.. ఎన్ని కష్టాలు వచ్చినా.. విలువలు, విశ్వసనీయతకే పెద్దపీట వేశానని అన్నారు. రాజకీయంగా ఇబ్బందులు వచ్చినా రాజీ పడలేదని.. ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ తనకు వచ్చిందని అన్నారు. పార్లమెంటులో ప్రతి సభ్యుడూ తనవైపు చూసే పరిస్థితి ఉండేదని.. దాన్ని జీర్ణించుకోలేక తనమీద పగబట్టారని అన్నారు జగన్. 18 మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తే వాళ్లందరిచేతా రాజీనామా చేయించానని.. ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించామని అన్నారు. ఆ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ కాంగ్రెస్ కలిసి పోటీచేశాయని గుర్తు చేశారు. 2014లో 67 మందితో గెలిచామని.. గెలిచిన 67 మందిలో 23 మందిని చంద్రబాబు లాక్కున్నారని అన్నారు.

దేవుడి స్క్రిప్ట్ ప్రకారం 2019 ఎన్నికల్లో వాళ్ళు లాక్కున్న 23 సీట్లకే పరిమితమయ్యారని అన్నారు జగన్. ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యమని.. ప్రజలకు సమస్య వచ్చినప్పుడు ప్రజలకు తోడుగా నిలబడాలని.. మంచి పలకరింపు అన్నదికూడా చాలా ముఖ్యమని.. ఇవి చేయగలిగితే.. లీడర్‌గా ఎదుగుతారని అన్నారు జగన్. మళ్ళీ పాదయాత్ర ఉంటుందని వైఎస్ జగన్ ప్రకటించడంతో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఈసారి వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. జగన్ 2.0 లోడింగ్ అంటూ కామెంట్ చేస్తున్నారు వైసీపీ శ్రేణులు.


# పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, రూ. 25 వేలు జరిమాన

**మైనర్ బాలిక పట్ల అఘాయిత్యంకు పాల్పడిన ఘటనలో శిక్ష ఖరారు**
**కర్నూలు జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టు తీర్పు వెలువరింపు**



కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో కర్నూలు పోలీసులు ముద్దాయిలకు కఠిన శిక్షలకై గట్టి చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు షేక్ చాంద్ బాషా (21 సం.రాలు), అమరావతినగర్, ఆదోని పట్టణం, కర్నూలు జిల్లాకు చెందిన వాడు. కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. నిందితుడు షేక్ చాంద్ భాషా ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఒక మైనర్ బాలిక పట్ల అఘాయిత్యంకు పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా, పత్తికొండ పట్టణంకు చెందిన మైనర్ బాలిక తల్లి బోయ లక్ష్మి ఫిర్యాదు మేరకు 2021 ఫిబ్రవరి 7 వ తేదీన పత్తికొండ యుపిఎస్ పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 64 / 2021 u/s 366 (A) , 376(2)(I)(N) IPC and Sec 6 of r/w 17 of పోక్సో యాక్ట్ 2012 నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు. అప్పటి డోన్ డిఎస్పీ వై. శ్రీనివాస రెడ్డి దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించి, నేరం రుజువు కావడంతో కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి శ్రీ ఇ.రాజేంద్రబాబు నిందితుడు షేక్ చాంద్ భాషాకు 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష , రూ. 25 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. జరిమానా కట్టని యెడల 6 నెలలు జైలు శిక్ష పొడగిస్తారని తెలిపారు. తక్కువ కాల వ్యవధిలోనే ఈ కేసులో ట్రైల్‌ను పూర్తిచేసి సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టుటకు కృషి చేసిన పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్యను, పత్తికొండ యుపిఎస్ సిఐ జయన్నలను ఎస్పీ అభినందించారు. ఈ కేసులో క్రియాశీలంగా వ్యవహరించి ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన స్పెషల్ పి.పి సి . వి శ్రీనివాసులు, దర్యాప్తు అధికారి డోన్ డిఎస్పీ వై. శ్రీనివాస రెడ్డి , పత్తికొండ కోర్టు కానిస్టేబుల్స్ పి.ఎమ్. డి హానీఫ్ లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని జిల్లా ఎస్పీ పేర్కోన్నారు

# వారి కళ్లలో ఆనందమే మా సంతోషం: మంత్రి నారాయణ



నెల్లూరు, జులై 1(శ్రీచక్ర) : రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలోని మన్సూర్ నగర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంత్రి నారాయణ ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నెలా 1వ తేదీ పెద్ద పండుగలా పింఛన్ల పంపిణీ సాగుతుందని తెలిపారు. ఏపీలో 67 లక్షల మంది కళ్లలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్ల పంపిణీకి ఖర్చు చేస్తున్నామని.. త్వరలోనే రైతులకు రూ.20 వేలు అందిస్తామని వెల్లడించారు. అలాగే ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకానుందన్నారు. తామిచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి తీరుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, క్రమం తప్పకుండా రూ.4 వేలు చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు పింఛన్ల పంపిణీలో చరిత్ర సృష్టించారన్నారు. వైసీపీ చెడు ఆలోచనలతో తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మంత్రి నారాయణ రేయింబవళ్లు శ్రమిస్తున్నారని.. ఆయన జిల్లా మంత్రిగా ఉండటం అందరి అదృష్టమని ఎంపీ వేమిరెడ్డి కొనియాడారు.పింఛన్ల పంపిణీ అనంతరం నగరంలోని ఆర్ఎస్ఆర్, వీఆర్ స్కూళ్లను ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ పరిశీలించారు. అలాగే వీఆర్ హైస్కూల్ పిల్లలకు కొద్దిసేపు పాఠాలు భోదించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..'నేను ఋషీవ్యాలీ స్కూల్‌లో చదివా. అంతకంటే గొప్పగా వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దారు. రూ.లక్షకి పైగా ఫీజులు చెల్లిస్తే కానీ అందని కార్పోరేట్ విద్యని పేద పిల్లలకు ఉచితంగా అందించడం సంతోషం. మూతపడ్డ స్కూల్‌ను అంతర్జాతీయ స్థాయి స్కూల్‌గా తీర్చిదిద్దడం సాధారణ విషయం కాదు. 1050 సీట్లు ఉంటే, 5 వేల దరఖాస్తులు వచ్చాయి.

# సంపాదకీయం

## కో లివింగ్ వల్ల నేరాలు పెరుగుతున్నాయా,

తెలుగు రాష్ట్రాల్లో కో లివింగ్ కల్చర్‌పై ఆందోళన వ్యక్తమౌతోంది,అమెరికా, కెనడా లాంటి దేశాల్లో కో లివింగ్‌కు, హైదరాబాద్, బెంగళూరు, భారత్‌లోని ఇతర నగరాల్లో కో లివింగ్‌కు తేడా ఏంటి?భారత్‌లాంటి దేశాల్లో ఒకప్పుడు పరిచయంలేని అమ్మాయిలు, అబ్బాయిలు రోడ్డు మీదో, ఇంకెక్కడైనా బహిరంగ ప్రాంతాల్లోనో కలిసి కనిపించడాన్నే తప్పుగా భావించేవారు.కో ఎడ్యుకేషన్ కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుకున్నా...అమ్మాయిలు, అబ్బాయిల మధ్య స్నేహానికి, కలిసి తిరగడానికి సమాజం ఓ విభజన రేఖను ఏర్పరిచింది. ఆ పరిధిలోనే మనుషుల ఆలోచనా విధానం ఉండేది.కానీ కాలక్రమేణా పరిస్థితులు మారాయి. దిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ సిటీల్లో జీవన విధానంలో మార్పులొచ్చాయి. ఐటీ రంగం విస్తృతితో గతంలోలా ఆడ, మగ మధ్య పెద్దగా భేదాలుండటం లేదు. ఒకేచోట కలిసి పని చేయాల్సి రావడం, యువతీ యువకుల ఉద్యోగ విధులు ఒకే తరహాలో ఉండడంతో వారి ఆలోచనా విధానంలోనూ మార్పులొచ్చాయి.ఆఫీసు అవసరాల రీత్యా కలివిడిగా ఉండడం తప్పనిసరైంది. అదే సంస్కృతి జీవన విధానంలోనూ ప్రతిబింబిస్తోంది రెండు దశాబ్దాలుగా సామాజికపరంగా వచ్చిన మార్పు ఇదైతే, అదే సమయంలో ఓ మోస్తరు పట్టణాల నుంచి భారీ నగరాల దాకా అన్నిచోట్లా భారీ స్థాయిలో పెరిగిన జీవన వ్యయం.. జీవన విధానాలపై పెను ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యం నుంచి ఆవిర్భవించిందే కో లివింగ్ కల్చర్.రక్తసంబంధం, బంధుత్వం, వివాహ బంధం వంటివేమీ లేని ఓ అమ్మాయి లేదా అబ్బాయి, కొందరమ్మాయిలు లేదా అబ్బాయిలు ఒకే ఇంట్లో కలిసి ఉండడమే కో లివింగ్.ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు కలిసి ఉన్నట్లుగా, ఇద్దరు ముగ్గురు అబ్బాయిలు కలిసి ఉన్నట్లుగానే, ముగ్గురు నలుగురు అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి ఒకే ఇంట్లో ఉండటం అత్యంత సహజమని, దాన్ని శారీరక సంబంధాల కోణంలో చూడాల్సిన అవసరం లేదని కో లివింగ్ సంస్కృతి గురించి తెలిసిన వాళ్లు అంటున్నారు.కలిసి ఉన్నంత మాత్రాన వారు శారీరక సంబంధాలు ఏర్పరుచుకుంటారన్న భావన సరికాదని, ఒకవేళ అలా ఏర్పరుచుకున్నా అది వ్యక్తిగత విషయంగా చూడాలని వారు అంటున్నారు.అయితే, పెళ్లి కాని అమ్మాయి, అబ్బాయి ఒక ఇంట్లో కలిసి ఉండడం తప్పన్న అభిప్రాయం మన సమాజంలో ఉంటుంది. ఈ కోణంలో చూసి, ఈ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలని వీహెచ్ కోరారు.పెళ్లిచేసుకుని విడిపోవడం కన్నా, ఒక చోట కొంతకాలం కలిసి జీవించడం ద్వారా వివాహ బంధంలోకి అడుగుపెట్టాలా లేదా అన్నదానిపై నిర్ణయం తీసుకోవచ్చని భావించేవారు, హాస్టళ్లు, పేయింగ్ గెస్టల వంటి ఖర్చులు భరించలేనివారు కో లివింగ్ స్పేసెస్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ సహా అనేక ప్రాంతాల్లో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లు, బాయ్స్ పీజీలకు చాలా డిమాండ్ ఉంటుంది. ఇలాంటి నివాస సదుపాయాలు అమ్మాయిలకు, అబ్బాయిలకు వేర్వేరుగా ఉంటాయి. వాళ్లు చెల్లించగలిగే మొత్తాన్ని బట్టి సౌకర్యాలు అందిస్తుంటారు.యువతీ యువకులు, స్టూడెంట్లు, ఉద్యోగాలు చేసేవారు పీజీల్లో ఉండేందుకు ఎక్కువగా మొగ్గు చూపిస్తారు. భోజన సదుపాయంతో పాటు పీజీల్లో భద్రత ఉంటుందని భావించడం దీనికి మరో కారణం.అయితే పీజీల్లో ఉండడం ఇష్టం లేనివారు, మరింత సౌకర్యవంతంగా ఉండాలని భావించే కొందరు... ముగ్గురు, నలుగురు కలిసి సొంతంగా గదులు అద్దెకు తీసుకుని ఉంటుంటారు.ఇవి కాకుండా ఇప్పుడు కొత్తగా వ్యాప్తి చెందుతున్న సంస్కృతి కో లివింగ్.వారు ఒకే ఇంట్లో నివసించడానికి వీలుగా అవసరమైన సదుపాయాలను నిర్వాహకులు కల్పిస్తారు. ఇది సరైన విధానం కాదని, నేరాలు పెరిగే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.సైబరాబాద్ కేంద్రంగా ఈ సంస్కృతి విస్తరించిందని వీహెచ్ చెబుతున్నారు. ఐటీ రంగం ప్రభావం హైటెక్‌సిటీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గడచిన 20ఏళుగా బాగా పెరిగింది. రియల్ ఎస్టేట్ ప్రభావంతో ఇళ్ల స్థలాల ధరలు, ఇళ్ల ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి హైటెక్ సిటీ చుట్టుపక్కల పీజీల సంఖ్యా బాగా పెరిగింది. అయితే పీజీలు సౌకర్యవంతం కాదని భావించేవారికి, స్థోమత ఉన్నవారికి, ఇంట్లోనే ఉంటున్నామన్న భావన కల్పించడానికి, మరింత మెరుగైన సౌకర్యాలతో కో లివింగ్ హాస్టళ్లు అందుబాటులోకొచ్చాయి. లగ్జరీ హోటళ్లలో దొరికే సౌకర్యాలు, సేవలను ఈ పీజీల్లో కల్పిస్తున్నారు.''ఆఫీసులో కొంచెం లైక్‌మైండెడ్ అనుకున్న వాళ్లమంతా కలిసి ఒకే ఇల్లులాంటి స్పేస్‌లో ఉండటం బాగుంది. ఖర్చులూ కలిసొస్తాయి. బయట ఎక్కడో హాస్టల్లోనో, రూమ్ తీసుకుని ఒంటరిగానో ఉంటున్నామన్న ఫీలింగ్ కూడా ఉండదు'' అని వరంగల్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో తన స్నేహితులతో కలిసి ఒక ఫ్లాట్‌లో ఉంటున్న ఓ యువతి చెప్పారు. ఆమె తన పేరు ప్రచురించడానికి ఇష్టపడలేదు.పెద్దగా ఖర్చుపెట్టే ఆర్థిక స్థోమత లేనివారికీ ఇది సదుపాయంగా ఉంది. కొందరు భోజన సదుపాయం కల్పిస్తుంటే మరికొందరు కామన్ కిచెన్, కామన్ లివింగ్ రూమ్, సెపరేట్ బెడ్‌రూంలో ఆడా, మగా ఒకే చోట నివసించే సదుపాయం కల్పిస్తున్నారు..భారత్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం అమెరికా, కెనడా వంటి దేశాలకు వెళ్లేవారు ఇలా కో లివింగ్‌కే ప్రాధాన్యం ఇస్తారు. స్వదేశంలో ఉన్న పరిచయంతో పాటు, ఒకే దేశం, ఒకే ప్రాంతానికి చెందిన వాళ్లమన్న భావన కోసం, ఆర్థిక భారం తగ్గించుకోవడం కోసం నలుగురు లేదా ఐదుగురు అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే ఇంట్లో ఉంటుంటారు. వంటపని, ఇంటిపని షేర్ చేసుకుంటూ కలిసి జీవిస్తుంటారు.ఇది రహస్య వ్యవహారమేమీ కాదు. స్వదేశంలోని వారి తల్లిదండ్రులకు, బంధుమిత్రులందరికీ ఈ విషయం తెలిసేలానే ఉంటారు. అందరూ ఇది సాధారణ విషయంగానే భావిస్తారు.ఇక సింగపూర్, మలేషియా లాంటి దేశాల్లో మరో రకం కో లివింగ్ కల్చర్ ఉంది. ఇక్కడ కుటుంబాలే ఒక ఇంటిని షేర్ చేసుకుంటుంటాయి. ఒక డబుల్ బెడ్ రూం ఇంట్లో ఒక బెడ్ రూంలో ఓ కుటుంబం, మరో బెడ్ రూంలో మరో కుటుంబం ఉంటాయి.

## యోగాంధ్ర పోటీల విజేతలకు అభినందించిన కలెక్టర్





కర్నూలు స్పోర్ట్స్, జూలై 1 (శ్రీచక్ర) :జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీలలో విజేతలైన 19 విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం కర్నూలులోని తన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూవిద్యార్థులు ప్రతి రోజు దైనందిన జీవితంలో యోగా సాధనను అంతర్భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి యోగా సాధన కోసం ప్రత్యేకంగా సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ఆ దిశగా సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. నెల రోజుల పాటు జరిగిన యోగాంధ్ర కార్యక్రమాలలో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై విజయవాడలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కర్నూలు నగరానికి చెందిన జాతీయ స్థాయి యోగా భూషణ్ అవార్డు గ్రహీత యోగా గురువులు అవినాష్ శెట్టి, డాక్టర్ ఎస్ ముంతాజ్ బేగం లను జిల్లా కలెక్టర్ సత్కరించారు.ఈ కార్యక్రమం లో సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, జెడ్పి సీఈవో నాసర్ రెడ్డి, మునిస్వామి, జిల్లా యోగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు మంత్రాలయం ఎస్సై శివాంజల్




మంత్రాలయం, జూలై 1(శ్రీచక్ర) : మంత్రాలయంలో వాహన దారులు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం ఎస్సై శివాంజల్ వాహన దారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియా ద్వారా మాట్లాడుతూ, ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తున్నారని, వారికి ఎటువంటి అంతరాయం అసౌకర్యం కలుగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మంత్రాలయంలో రాఘవేంద్ర కూడలి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వాహనాలు ఎక్కడ నిలుపరాదని వాహన దారులకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు నిలపాలన్నారు. అలాగే భక్తులు దర్శనానికి వెళ్లే ముందు విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు లాడ్జీల్లో రూముల దొరకని వారు శ్రీ మఠం యజమాన్యము సూచించిన వెబ్ సైట్ లో మాత్రమే గదులు బుకింగ్ చేసుకోవాలని, ఫేక్ వెబ్ సైట్ లను నమ్మి మోసపోవద్దని సూచించారు. అలా ఏమైన మోసపూరిత వెబ్ సైట్ ద్వారా మోసాలు జరిగితే పోలీసులను గాని శ్రీ మఠం అధికారులను సంప్రదించాలన్నారు. సైబర్ నేరాలు నేరస్తులు, ఫేక్ వెబ్ సైట్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కొంత మంది దుకాణా దారులు నకిలీ పరిమళ ప్రసాదాలను విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కావున భక్తులు గమనించి శ్రీ మఠం యజమాన్యము ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్ల లో మాత్రవే పరిమళ ప్రసాదాలను తీసుకోవాలని, ఎవరైనా దుకాణాలలో మఠం సంబందించిన పరిమళ ప్రసాదం విక్రయిస్తునట్లు మాకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం - జనసేన ఇంచార్జ్, రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి లక్ష్మన్న



మంత్రాలయం, జూలై 1(శ్రీచక్ర) :మంత్రాలయం నియోజవర్గం కౌతాళం మండలం బదినే హాల్ గ్రామం జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఎర్రి స్వామికి రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని మంత్రాలయం జనసేన పార్టీ ఇన్చార్జ్, రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వాల్మీకి బి లక్ష్మన్న అందజేశారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఎర్రి స్వామి కి యాక్సిడెంట్ అయిన విషయం తెలుసుకున్న ఆయన బదినే హాల్ గ్రామంలోని ఇంటికి వెళ్లి ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని తగిలిన గాయాలను చూసి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలా యాక్సిడెంట్ అయింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి తో పాటు పెద్ద కడ బూర్ మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ బజారి ( అబ్రహం), జాలాడి శ్రీను గూడా ఎర్రి స్వామిని పరామర్శించి ఆయనకు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో ఏకగ్రీవంగా కోట మండలం నూతన టీడీపీ అధ్యక్షులు గా పలగాటి భాస్కర్ రెడ్డి ఎన్నిక...,



**కోట మండలం, కొక్కు పాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్ రెడ్డి...,**
**టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీ లో కొనసాగుతున్న పలగాటి భాస్కర్ రెడ్డి..,**
**నూతన అధ్యక్షులు గా ఎన్నికైన పలగాటి. భాస్కర్ రెడ్డి కి అభినందనలు తెలిపిన నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, తదితరులు....,**

కోట జూలై 1 (శ్రీ చక్ర) : గత కొంత కాలంగా కోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందో అని ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. . ఎన్నడూ లేని విధంగా 2025 లో కోట మండలం టీడీపీ అధ్యక్ష పీఠం పై అందరూ గురిపెట్టారు. రెడ్డి, మైనారిటీ, బి సీ సామజిక వర్గాన్ని కి చెందిన నాయుకులు పోటీ పడ్డారు .అయితే కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గూడూరు పట్టణం లోని టీడీపీ క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, గూడూరు నియోజకవర్గం పార్టీ పరిశీలకులు శివ కోటా రెడ్డి ఆధ్వర్యంలో కోట మండల అధ్యక్షులు గా పోటీ నిలిచిన మద్దాలి సర్వోత్తమ రెడ్డి, షేక్ జలిల్ అహ్మద్, పాదర్తి కోటేశ్వరరెడ్డి, తీగల సురేష్ బాబు లతో పాటు టీడీపీ నాయుకులు తో చర్చ లు జరిపి అందరిని సర్దు బాటు చేసి అధ్యక్ష పదవి పోటీ నుండి ఉప సంహారణ చేయించారు. టీడీపీ నాయుకులు నెల్లూరు మోహన్ రెడ్డి, పాదర్తి కోటేశ్వరరెడ్డి లు నూతన అధ్యక్షులు గా భాస్కర్ రెడ్డి పేరు ను ప్రతిపాదించారు. తరువాత అందరి నిర్ణయాలు, అభిప్రాయాలు తీసుకోని నూతన అధ్యక్షులు గా వివాదాస్పద రహితుడు పలగాటి భాస్కర్ రెడ్డి పేరును ఎమ్మెల్యే ప్రకటించారు. దింతో అధ్యక్ష పీఠం పై ఉత్కంఠకు తెరపడింది. టీడీపీ విధేయుడు పలగాటి భాస్కర్ రెడ్డి.కోట మండలం, కొక్కు పాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్ రెడ్డి టీడీపీ ఆవిర్భావం నుండి పార్టీ లో కొనసాగు తున్నారు.. కొక్కుపాడులో.. తిరుగులేని టీడీపీ నాయకుడుగా గుర్తింపు పొందారు.సౌమ్యుడు, స్నేహశీలి, మృధుస్వభావి, మంచి మనస్సున్న వాడు, అందరివాడు గా పలగాటి భాస్కర్ రెడ్డి కీర్తి పొందారు. వివాదాస్పద రహితుడు గా ఆయన గుర్తింపు పొందారు.టీడీపీ కరుడు కట్టిన నాయకుడు భాస్కర్ రెడ్డి ఆయన సేవలు స్ఫూర్తి దాయకం.పలగాటి భాస్కర్ రెడ్డి అధ్యక్ష పదవి బాధ్యత తో కోట మండలంలో టీడీపీబాగా బలోపేతంఅవ్వడం లో ఎటువంటి సందేహం అక్కర్లేదు. నల్లపరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితులు పలగాటి భాస్కర్ రెడ్డి ఉన్నారు.ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్,గంగ ప్రసాద్ లకు కూడ అత్యంత సన్నిహితులు నూతన టీడీపీ అధ్యక్షులు గా పలగాటి భాస్కర్ రెడ్డి.కోట మండలం నూతన తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గా ఎన్నికైన పలగాటి భాస్కర్ నీ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు శాలువా కప్పి గజ మాలలు వేసి ఘనంగా సత్కరించారు.

## రాఘవేంద్ర రెడ్డిని సన్మానించిన మంచాల సొసైటీ సహకార సంఘం డైరెక్టర్లు



మంత్రాలయం, జూలై 1,(శ్రీచక్ర) :మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం తెదేపా కార్యాలయం నందు మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డిని మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు డిసి తిమ్మప్ప , చాపల నాగేష్ లు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు మాట్లాడుతూ మాకు డైరెక్టర్లు గా అవకాశం కల్పించినందుకు కూటమి పార్టీ అధిష్టాన నాయకత్వానికి , ముఖ్య పాత్ర పోషించిన ఇంచార్జ్ రాఘవేంద్ర ,రఘునాథ్ రెడ్డి, ఎన్. రామకృష్ణ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ అవకాశాన్ని రైతన్నల శ్రేయస్సు కోసం కృషి చేసి,వారి సంక్షేమ అభ్యున్నతికి పాటు పడతామన్నారు. అంతకు ముందు టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి ,మంచాలసొసైటీ సహకార సంఘం చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి లు డైరెక్టర్లు శాలువా కప్పి , పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమములో ఎంపిటిసి బోయ వెంకటేష్ , మంత్రాలయం టీడీపీ టౌన్ ఇన్చార్జి వరదరాజు , టీడీపీ నాయకులు బంగారు నరసింహ, రాఘవేంద్ర , శివ , డేవిడ్ , రాజన్నకూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరాధనోత్సవాల ఏర్పాట్లు పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష -శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు



మంత్రాలయం జూలై 1,(శ్రీచక్ర) :ప్రసిద్ధ పుణ్యక్షేత్రమెన మంత్రాలయంశ్రీరాఘవేంద్రస్వామిమఠంలో జరుగనున్న రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల ఏర్పాట్ల పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 8 నుంచి 14 వరకు జరిగే రాఘవేంద్ర స్వామి 354 వ ఆరాధన మహోత్సవాల్లో పాల్గొననున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు వివిధ పాయింట్లలో సిబ్బంది ఏర్పాటు చేయడంతో పాటు భోజనశాలలో స్వచ్ఛంద సంస్థలతో సేవాదారులు , భద్రత పరమైన అంశాలట్రాఫిక్ , పారిశుద్ధ్య , డ్రైనేజీ సమస్యలు చర్చించినట్లు , పేర్కొన్నారు. ఆరాధనోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్ జ్యోషి, ధార్మిక అధికారి శ్రీ పతి ఆచార్ ,తహాశీల్దార్ రమాదేవి ,ఎస్ఐ శివాంజుల్ , పంచాయతీ సెక్రటరీ ఉపేంద్ర రెడ్డి , సర్పంచ్ భీమయ్య , విద్యుత్ , అగ్నిమాపక ఎస్ఐ , మఠం అధికారులు, పాల్గొన్నారు.

## విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలి -మాధవరంఎస్ఐ విజయకుమార్



మంత్రాలయం , జూలై 1,(శ్రీచక్ర) : విద్యార్థులు ఈవ్ టీజింగ్ , సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని మాధవరం ఎస్ఐ విజయకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు నేరాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సైబర్ నేరాలు, ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ , మహిళలు , చిన్న పిల్లల పై జరుగుతున్న అఘాయిత్యాలు , రోడ్డు ప్రమాదాలు పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ , ఉపాధ్యాయురాలు నలిని , తదితరులు ఉన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

మంత్రాలయం , జూలై 1,(శ్రీచక్ర) : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్రపురం కాలనీలో మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం టిడిపి టౌన్ ఇన్చార్జి వరదరాజులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బోయ వెంకటేష్ , మంచాల సొసైటీ సహకార సంఘం డైరెక్టర్ డిసి తిమ్మప్ప, టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి , బంగారు నరసింహ , రాఘవేంద్ర , శివ , సచివాలయా అధికారులు పాల్గొన్నారు.



## అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం

### రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి టి.జి భరత్



కర్నూలు, జూలై 01 (శ్రీచక్ర): కర్నూలు నగరంలో అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళవారం ఉదయం స్టేట్ గెస్ట్ హౌస్ లో మంత్రి టి.జి భరత్.. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, కర్నూలు తహసిల్దార్ వెంకట రమేష్, అర్బన్ తహసిల్దార్ రవి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ ప్రజలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విధంగా కర్నూల్లో కూడా పంపిణీ చేసేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. నగరంలోని పంప్ హౌస్ సమీపంలో ఉన్న గూడెం కొట్టాల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు వారికి పట్టాలు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి వారి పేరు మీద పట్టాలు ఇవ్వటానికి ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గతంలో ఇళ్ల పట్టాలిచ్చిన వారికి స్థలాలు లేవని చాలా మంది తన దృష్టికి తీసుకువచ్చారని.. ఈ వివరాలు తీసుకొని పట్టాలు ఉన్నప్పటికీ స్థలాలు లేని వారికి స్థలాలు చూపించాలని చెప్పారు. అలాగే బుధవారపేట ప్రాంతంలో నివాసితుల వివరాలు తీసుకొని పట్టాలు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. 2014కి ముందు ఈ.తాండ్రపాడులో పట్టాలిచ్చిన ప్రాంతంలో స్థలాలు గుర్తించలేని పరిస్థితి నెలకొందని..ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి టి.జి భరత్ అన్నారు. వెంకటరమణ కాలనీ మున్సిపల్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న నాలుగున్నర ఎకరాల డాటెడ్ ల్యాండ్ పోలీసు వారి దగ్గర నుండి కర్నూలు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల నిమిత్తం తీసుకోవటానికి కావలసిన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఏ,బి,సి క్యాంప్ ల ప్రభుత్వ గృహ సముదాయాల్లో శిథిలావస్థకు చేరిన గృహాలను పూర్తిగా తొలగించి చదును చేయాలని ఆ స్థలాలను ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి అనుకూలంగా మార్చాలని ఆదేశించారు.

## జిల్లాలోని 2,36,640 మందికి రూ.102.89 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ

### లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను అందజేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత




కర్నూలు, జూలై 01 (శ్రీచక్ర): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జూలై మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 36 వేల 640 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.102.89 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో లక్ష్మమ్మ, సుంకన్న, మాసమ్మ, సత్యం, వెంకటస్వామి లకు వృద్ధాప్య పెన్షన్,లక్ష్మీదేవి, కుసుమకుమారి, వెంకటలక్ష్మి లకు వితంతువు పెన్షన్, హనుమన్న,మద్దయ్య లకువైకల్య పెన్షన్ లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెన్షన్ లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తూ కలెక్టర్ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ప్రతినెల సరైన సమయానికి వచ్చి అందిస్తున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వారు నివాసం ఉంటున్న ఇళ్ళు సొంతమా లేదా అద్దెకు ఉంటున్నారా అని అడిగి తెలుసుకొని అద్దె ఇళ్లు అయినట్లయితే ఇంటి పట్టా కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఇంటి పట్టా కొరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న కొంతమంది ప్రజలు కాలువలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, డిఆర్డిఎ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భావి జీవితం ఆనందంగా గడపాలి

### ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి

### నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు

కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): పదవి విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ భావి జీవితం ఆనందంగా గడపాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. మంగళవారం పదవి విరమణ పొందిన ప్రణాళిక బిల్డింగ్ సూపర్వైజర్ ఇ.దామోదర్, చైన్‌మెన్ టి.వి. రమణలను కమిషనర్ సత్కరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి అని, తరువాతి శేష జీవితాన్ని తమ కుటుంబంతో సుఖ సంతోషాలతో గడపాలని సూచించారు. ఒక్క జూన్ మాసంలో 12 మంది పదవి విరమణ పొందడం తమకు కాస్త ఇబ్బంది అయినప్పటికీ ఉద్యోగులకు పదవి విరమణ తప్పదన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో బిల్డింగ్ సూపర్వైజర్ ఇ.దామోదర్, చైన్‌మెన్ టి.వి. రమణ, ప్రధాన విభాగంలో వి.ఆనంద్ బాబు, ప్రజారోగ్య విభాగంలో 9 మంది పారిశుద్ధ్య కార్మికులు పదవి విరమణ పొందినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఉద్యోగులకు పదవి విరమణ ప్రయోజనాలు పొందేందుకు తమ వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వేనేజర్ యన్.చిన్నరాముడు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, పట్టణ ప్రణాళిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఠంచనుగా ఒకటవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

### ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం:మంత్రి టి.జి. భరత్





కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): రాష్ట్రంలో ఠంచనుగా ప్రతి నెలా ఒకటవ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేస్తున్నామని,ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో కి తెస్తున్నాం అని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కర్నూలు పట్టణ కె.సి. కెనాల్ ప్రక్కన స్వామి రెడ్డి నగర్ లో పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ కె.యి.వరలక్ష్మీ- రూ4000,కె.లక్ష్మి దేవి-రూ4000,సి.నాగలక్ష్మి-రూ6000,షేక్షావలి రూ6000,మెహబూబ్ భాష-రూ6000,లతీఫ్ ట్రాన్స్ జెండర్-రూ4000 లకు వారి ఇంటి వద్ద కు వెళ్లి చేశారు. వృద్ధాప్య పెన్షన్ 4వేలు,వికలాంగ పెన్షన్లు 6వేలు చొప్పున దాదాపు 35 మందికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అందరి ఇళ్లకు వెళ్లి పెన్షన్లను ఒకటవ తారీఖున మీ దగ్గర కు వచ్చి పంపిణీ చేస్తున్నామని , రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందని , ఒకటవ తారీకు సెలవు ఉంటే ఒక రోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రమంతటా అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే ఆహారం అందిస్తున్నామని తెలియజేశారు. చదువుకుంటున్న పిల్లలకు తల్లికి వందనం అమలు చేసి కుటుంబము లో ఎంతమంది పిల్లలు కలిగి ఉన్నారో అంత మందికి తల్లికి వందనం అమలు చేసి సొమ్మును అందజేస్తున్నామని, ఆగష్టు 15 నుండి మహిళలకు ఉచితంగా బస్సు సేవలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. ఒకే ఇంటిలో తల్లికి వందనం అందుకున్న ఐదు మంది పిల్లలు మరియొక చోట ముగ్గురు పిల్లలు తల్లికి వందనం అందుకున్న వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ గత ప్రభుత్వం కుటుంబంలో కేవలం ఒక విద్యార్థికి మాత్రమే సొమ్ము చెల్లించేదని తెలిపారు.పిల్లలకు యూనిఫారం, పాఠశాల పుస్తకాలు తదితరులు కూడా ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, 16 వార్డు స్థానిక కార్పొరేటర్ శ్రీమతి విజయ కుమారి , 8 వార్డు కార్పొరేటర్ పరమేశ్వర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైద్యసేవకే వన్నెతెచ్చిన బీసీరాయ్

### ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ





కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): డాక్టర్స్ డే వేడుకలను జీ. పుల్లారెడ్డి దంత వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నేషనల్ డాక్టర్స్ డే విశిష్టతను డాక్టర్ శంకర్ శర్మ దంత వైద్య విద్యార్థులకు తెలియజేశారు.ప్రతి సంవత్సరం జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినత్సవంగా నిర్వహిస్తామని ఇందుకు కారణం వైద్యసేవకే వన్నెతెచ్చిన బీసీరాయ్ అని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. బీసీ రాయ్ జన్మదినం, మరణించిన రోజూ రెండూ జూలై1 అందుకే ఆయన స్మారకార్థం ప్రతీ ఏడాది జూలై ఒకటన తేదీన వైద్యుల దినోత్సవంగా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంతేకాక ఆయన పేరు మీద వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి 1976 నుంచి అవార్డులు అందిస్తున్నారన్నారు. వైద్య విద్యార్థులు వారి ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. డాక్టర్లు పేషంట్లతో మంచిగా మాట్లాడి వారికి చికిత్స అందించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువగా ఉందని కనీసం రోజులో ఒక గంట సమయం అన్న సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మంచి ఆహారం, వ్యాయామం, ధ్యానం చేయాలని డాక్టర్. శంకర్ శర్మ సూచించారు. ఈసందర్భంగా డెంటల్ కళాశాల యాజమాన్యం డాక్టర్. శంకర్ శర్మను సన్మానించారు. ఈకార్యక్రమంలో జీ. పుల్లారెడ్డి దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగలక్ష్మిరెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్





కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని ఆయన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ముఖ్య సమావేశం నిర్వహించారు. సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై మంత్రి టి.జి భరత్ వారికి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజలకు మంచి చేయడం ఒక భాగమైతే.. చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం మరొక భాగమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చాక పింఛన్ పెంచి ఇచ్చామని, దేశంలో ఎక్కడా లేని విధంగా తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, అన్నా క్యాంటిన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నామని, ఏడాదిలోనే తొమ్మిదిన్నర లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఈ కంపెనీల వల్ల రాబోయే రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తాను అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వార్డుల్లో 250కిపైగా విద్యుత్ పోల్స్ మార్చినట్లు చెప్పారు. ఒకదాని తర్వాత మరొక సమస్య పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. గుజరాత్ రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం స్థిరంగా కొనసాగితే దేశంలోనే మన రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ క్యాడర్ మొత్తం ఇప్పటి నుండి ఈ కార్యక్రమాన్ని ప్రతి రోజూ చేయాలన్నారు. నాయకుల పనితీరును బట్టి రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీట్లు ఇచ్చే విషయంలో పరిగణలోకి తీసుకోవడం జరుగుతందన్నారు. కష్టపడే వారికి పార్టీలో గౌరవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేషన్ల డైరెక్టర్లు ముంతాజ్, సంజీవలక్ష్మి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రైతులపై భారం మోపే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి,



ఎమ్మిగనూరు, జూలై, 1 (శ్రీ చక్ర):-కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి నాంది అవుతుందని పేర్కొంటూ, రైతులపై పంటల బీమా ప్రీమియం భారం మోపే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ముగతి గ్రామంలో ఆయన స్వగ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమం కేంద్ర బిందువుగా సాగిందని గుర్తు చేశారు.రైతులపై ఒక్క రూపాయి భారమూ వేయకుండా, ఉచిత పంటల బీమా ద్వారా 54 లక్షల మంది రైతులకు 7,800 కోట్ల బీమా నగదు నేరుగా ఖాతాల్లో జమ చేయడం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ విశిష్టత అని తెలిపారు.కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రైతులే ప్రీమియం చెల్లించాలని చెబుతోంది. ఇది రైతులను దగా చేయడమే కాకుండా, వారి ఆర్థిక స్థితిని మరింత దిగజార్చే చర్య అని ఆయన అన్నారు.వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు ఇప్పుడు హెక్టరుకు వేల రూపాయలు చెల్లించమని ఒత్తిడి చేయడం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.వైయస్ జగన్ రైతుకు అండగా నిలబడ్డ నాయకుడు అని తెలిపారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు గౌరవం కలిగేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల జోలికొస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు.రైతుల పక్షాన మా పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందవరం మండల ఉపాధ్యక్షులు రాఘవ రెడ్డి,రంగా రెడ్డి,సోమశేఖర్ రెడ్డి,లింగ రెడ్డి, బీముడు, పింజారి రాజాక్ తదితరులు పాల్గొన్నారు

## యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను తనిఖీ చేస్తున్న కర్నూలు పోలీసులు





కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారి పై జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలోని ఆయా కళాశాలల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను తనిఖీ చేస్తున్నారు. ఈవ్ టీజింగ్ , ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా యాంటీ ఈవ్ టీజింగ్ ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో , విద్యార్థినులపై జరిగే అసభ్య ప్రవర్తనలను పూర్తిగా నియంత్రించాలనే సంకల్పంతో వివిధ పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్ టీజింగ్ ను అరికట్టడం కోసం ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈవ్ టీజింగ్ ను అరికట్టేందుకు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఈవ్ టీజింగ్ పాల్పడే వారిపై నిఘా ఉంచి 17,467 మందిని జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలలో పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ బీట్స్ పోలీసులు కౌన్సిలింగ్ చేశారు.

## డాక్టర్స్ డే సందర్భంగా మొక్కలు నాటిన కిమ్స్ వైద్యులు

కర్నూలు, జూలై 1 (శ్రీచక్ర): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్స్ కర్నూలు వైద్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సీఓఓ డా. సునీల్ సేపూరి మాట్లాడుతూ వైద్యులు అంటే కేవలం వైద్యం చేయడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కాపాడుతున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఆస్పత్రి ప్రాగణంలో వైద్యులందరూ మొక్కలు నాటారని తెలిపారు. మన పరిసరాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. మనిషి స్వచ్ఛమైన గాలి అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు కూడా సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని కాపాడాలని పిలుపునిచ్చారు. వైద్యంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేయడంలో కర్నూలు కిమ్స్ హాస్పిటల్స్ ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన అన్ని విభాగాల వైద్యులు పాల్గొన్నారు.



## పూణేలో శ్రీ వరదేంద్ర తీర్థ ఆరాధన



మంత్రాలయం, జూలై 1(శ్రీచక్ర) : పుణెలోని వరదేంద్ర తీర్థల ఆరాధన సందర్భంగా మంగళవారం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థలు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ వరదేంద్ర తీర్థ మూల బృందవనానికి మహా మంగళారతి ఇచ్చి శ్రీ మూలరామ దేవర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మరియు శిష్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ స్వామిజీ ప్రతి ఒక్కరికీ ముద్రాధారణ, ఫల మంత్రాక్షతలతో ఆశీర్వదించారు.

## లబ్ధిదారులకు ఫింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సత్యవేడు,జూలై01(శ్రీచక్ర)ఫింఛన్ లు పంపిణీ ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.మంగళవారం ఉదయం నారాయణవనం మండలం కళ్యాణ పురంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వృద్ధాప్య, వితంతు,దివ్యాంగులకు,డయాలసిస్, పెరాలసిస్ బాధితులకు ఫించన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడంమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలో పెన్షన్ కు అర్హులైన వారిని గుర్తించి వారికి పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలన్నారు.తద్వారా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు,డయాలసిస్, పెరాలసిస్ బాధితులను ఆదుకున్న వారవుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణవనం ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి,ప్రజా ప్రతినిధులు,కూటమి పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.వరదయ్యపాలెం మేజర్ పంచాయతీ లోని గోవర్ధనపురం నందు డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు,మాజీ ఎంపీపీ భారతి పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.లబ్ధిదారులు ప్రభుత్వంకు ధన్యవాదములు తెలిపారు.

## ప్రముఖ గుండె వైద్య నిపుణులు వై.వి.సి రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సత్యవేడు, జులై 01(శ్రీచక్ర):చెన్నై అపోలో హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు వై.విజయ చంద్ర రెడ్డి ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.సోమవారం సాయంత్రం చెన్నై అపోలో హాస్పిటల్ కు చేరుకున్న ఎమ్మెల్యే, వై.విజయ చంద్ర రెడ్డి గారికి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వై.విజయచంద్రరెడ్డి తనకు మంచి మిత్రుడని..అందులో భాగంగా మర్యాద పూర్వకంగా కలిశానని తెలిపారు.

## అర్హులైన వారికే నివేశస్థలాలు మంజూరు చేయాలి

కోట జూలై 1 (శ్రీ చక్ర): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు నివేశ స్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు పట్టించుకోవడం లేదని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శిజి శశి కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా కోట తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.అనంతరం శశి కుమార్ మాట్లాడుతూ కోట మండల వ్యాప్తంగా అనేకమంది పేదవాళు ఇళ్ల స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవనే సాకుతో తల్లికి వందనం పథకానికి అనర్హులుగా చాలామందిని గుర్తిస్తున్నారన్నారు.ఆటో నడుపుకుని జీవిస్తున్న పేదల పొట్ట కోరుతున్నారని తెలిపారు.వాహన మిత్ర తొందరగా అమలు చేసిన ఆటో కార్మికులను ఆదుకోవాలని తెలిపారు.ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున రావు కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కె నారాయణ,జిల్లా నాయకులు శేషయ్య, భాస్కర్,కృష్ణ,శెట్టి,నజీర్,తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు సంతృప్తి స్థాయిలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందించాలి:జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి,జూలై 1(శ్రీచక్ర) : జిల్లాలో డా.ఎన్టీఆర్ వైద్య సేవా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి మరియు రోగులకు సంతృప్తి స్థాయిలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత వైద్యా అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టర్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు డా.ఎన్టీఆర్ వైద్య సేవా పథకం పై జిల్లా డిస్ప్లినరీ కమిటీ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వము పేదలకు ఉచితంగా చికిత్స కోసం ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని, జిల్లాలో డా. ఎన్టీఆర్ వైద్య సేవా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, వైద్యులు లాభాపేక్ష తో కాకుండా సేవ దృక్పథంతో సేవలు అందించాలి అని అన్నారు. డా. ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో భాగంగా ఎంపనెల్ చేయబడిన ప్రతి ఆసుపత్రి నిబంధనలు మరియు ట్రస్ట్ సూచించిన విధానాలను కచ్చితంగా పాటించాలి అని అన్నారు. రోగుల నుండి అనధికారకంగా డబ్బులు వసూలు చేసిన వారి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుతుందని తెలిపారు. రక్తపరీక్షలు, సీటీ స్కాన్ లాంటి స్కీమ్‌లో భాగమైన డయాగ్నొస్టిక్ సేవల విషయంలో ఆర్థోపెడిక్ కేసుల్లో రోగులను తప్పుదోవ పట్టించడం, ట్రస్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా అదనపు డబ్బులు వసూలు చేయరాదని అన్నారు.రోగుల పట్ల స్నేహపూర్వకంగా ప్రవర్తన మరియు మౌలిక సదుపాయాల కల్పన తో పాటు ఆసుపత్రులలో రోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి అని అన్నారు. ట్రస్ట్ మార్గదర్శకాల ప్రకారం త్రాగునీరు,భోజనం,ఇతర అవసరమైన సదుపాయాలను కల్పించాలి అని అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి కొన్ని హాస్పటల్ నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని రోగులు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని అన్నారు.చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన వారికి వారికి ఎన్టీఆర్ వైద్య సేవ కింద వారు జబ్బుకు సంబంధించి కవర్ అవుతుందా లేదా అనేది కచ్చితంగా తెలిపేలా చూడాలని తెలిపారు.రోగులను ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఖచ్చితంగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం గురించి తెలియజేయాలన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ..రోడ్ ట్రాఫిక్ యాక్సిడెంట్ (ఆర్టీఏ) కేసులలో వైద్యం నిరాకరణ ? స్కీమ్‌కు అర్హత ఉన్నప్పటికీ వైద్యం నిరాకరిస్తున్న సంఘటనలను పరిష్కరించాల్సిన అవసరం చాలా ఉందని అన్నారు. కియోస్క్ తిరిగి నిర్మాణం (ఖీవ రి -మోడలింగ్)?డా.ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ప్రమాణాలకు అనుగుణంగా హాస్పిటల్ కియోస్క్‌లను అప్‌గ్రేడ్ చేయడం, సరైన స్థలంలో ఉండేలా చూసుకోవాలి అని అన్నారు. ఒ1 బయోమెట్రిక్ మరియు ఐరిస్ పరికరాల కొనుగోలు,లబ్ధిదారుల సక్రమ గుర్తింపును సులభతరం చేయడానికి మరియు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి అని తెలిపారు.డిశ్చార్జ్ అనంతరం ఔషధాలు మరియు ఫాలోప్ సేవలు ట్రస్ట్ నిబంధనల ప్రకారం డిశ్చార్జ్ అయిన తరువాత కూడా రోగులకు అవసరమైన మందులు మరియు సహాయాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి,జిల్లా సమన్వయ అధికారి మరియు జిల్లా మేనేజర్ కె. శివకుమార్,మరియు ఎన్టీఆర్ వైద్య సేవా సిబ్బంది పాల్గొన్నారు. మరియు ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

## అత్తిలి బాలికల జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్

### మాతృభాష తో పాటు హిందీ కూడా నేర్చుకోవాలి :జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం /అత్తిలి జూలై 1 (శ్రీచక్ర )అత్తిలి బాలికల జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థినీలతో కొంత సమయం ముచ్చటించారు, ఎలా చదువుతున్నారు, ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా, స్కూలు ఆవరణ ఎలా ఉంటుంది మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం పథకం ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటుందా అని పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కూడా మన మాతృభాషతో పాటు నేషనల్ భాష అయిన హిందీ కూడా నేర్చుకోవాలని, భవిష్యత్తులో ఉపయోగమని అన్నారు. ప్రతిరోజు ఐదు హిందీ పదాలను క్రమం తప్పకుండా పిల్లలకు నేర్పాలని హిందీ టీచర్ కి సూచించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం లో భాగంగా తయారు చేసే వంటకాలను పరిశీలించారు. వంటగది పరిసరాలను ఎప్పుడు పరి శుభ్రముగా ఉంచాలని అన్నారు. మెనూ ప్రకారం వంటలను శుభ్రముగా చేయాలని పిల్లలు తినే ఆహారం లో ఎటువంటి పొరపాట్లు జరిగిన ఉపేక్షించమని ఎండిఎం వర్కర్లకు ఆదేశించారు. సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని పరిశీలించి స్వయంగా పిల్లలకు వడ్డించారు. స్కూలు ఆవరణ అంతా క్లీన్ అండ్ గ్రీన్ గా ఆహ్లాదముగా ఉండాలన్నారు. టాయిలెట్ ప్రతిరోజు శుభ్రము గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.జిల్లాజాయింట్ కలెక్టర్ వెంట తాహసిల్దార్ వంశీ, ఎం ఈ ఓ 1, ఎన్ రమేష్, ఎంఈఓ 2 కె..ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, జి.విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకం

### ఏరియా ఆసుపత్రి వైద్యులకు నేతలు సన్మానం



రామచంద్రపురం, జూలై 1(శ్రీచక్ర) ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని, వారి నిస్వార్థ సేవలు వెలకట్టలేనివని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలోని ఏరియా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ ప్రవీణ్ తోపాటు పలువురు వైద్యులను మంగళ వారం దుస్సాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవృత్తి అతి పవిత్రమైనదని, దేవుని తర్వాత వైద్యులకే ప్రతి ఒక్కరూ చేతులెత్తి నమస్కరించి గౌరవిస్తారన్నారు. కరోనా మహమ్మారి విపత్కర సమయంలో ఎనలేని సేవలందిం చిన డాక్టర్లకు, వైద్య సిబ్బందికి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కరోనా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్లకు ఘన నివాళులు అర్పించారు. సమాజం క్షేమం కోరుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం డాక్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని, వారిని గౌరవించుకోవడం మన కనీస బాధ్యత అన్నారు. ఆరోగ్య భారత్, ఆరోగ్యాంధ్రప్రదేశ్ కు వైద్యులే ప్రధాన భూమిక పోషించాలని ఈ సందర్భంగా కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది కాలంలో ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు, పలువురు వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు ప్రాణదాతలు :డాక్టర్ చప్పిడి

రామచంద్రపురం,జూలై 1( శ్రీచక్ర) వైద్యులు ప్రాణదాతలు అని సేవా భావంతో పనిచేస్తారని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు . మంగళవారం స్థానిక గాంధీ నగర్ లో అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు మద్ద వికాస్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యుల దినోత్సవ వేడుకలో పాల్గొని ఆయన మాట్లాడారు .ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వికాస్ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు ఎంతో ప్రేమగా ఆప్యాయంగా ఉంటారని తెలియజేశారు ముఖ్యఅతిథిగా గవర్నర్ పెంకి గోవిందరాజులు మాట్లాడుతూ వైద్య ఉత్రి ఎంతో పవిత్రమైనదని చెప్పారు. సౌత్ మల్టిపుల్ ట్రెజరర్ వనం శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వారి సేవలను సక్రమమైన రీతిలో మనం ఉపయోగించుకోవాలని తెలియజేశారు కార్యక్రమంలో మత్తు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ తారక కృష్ణ నులుకుర్తి,డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావులను ఘనంగా సత్కరించారు. వైద్యులపై భౌతిక దాడులు జరిపితే శిక్షార్హులని వైద్యులను గౌరవంగా చూడాలని మమ్మల్ని గుర్తించి సత్కరించిన అలయన్స్ క్లబ్ సభ్యులకు డాక్టర్ లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు జిల్లా క్యాబినెట్ కార్యదర్శి పెంకి శివకుమార్ పిఆర్ఓ సుభద్ర మన్యం గణేష్ వీరబాబు కాకరపల్లి శ్రీనివాసరావు, గణేష్ శ్రీనివాస్ నాగమణి అను శ్యామల సరళ తదితరులు పాల్గొన్నారు.



## పొలం పిలుస్తుంది కార్యక్రమం



కోట జూలై 1 (శ్రీ చక్ర): కోట మండలం లోని నెల్లూరు పల్లి కొత్తపాలెం గ్రామంలో రైతులు ఎరువులు పురుగుమందుల యాజమాన్యం మీద అవగాహన కలిగించారు.అవసరం మేరకే ఎరువులును పంటలకు వాడుకోవాల్సిందిగా తెలియజేసారు.పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం మీద రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినపుడు పంటల బీమా పథకం అయిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బి వై) గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎమ్.సుచేంద్ర ప్రసాద్,వ్యవసాయ విస్తరణ అధికారి డి.సాయి కుమార్,వి ఏ ఏ లు ప్రభు కిరణ్,వెంకటేశ్వర్లు,రైతులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన బంఫర్ హిట్



కోట జూలై 1 (శ్రీ చక్ర ) తెలుగుదేశం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన బంపర్ హిట్ అయిందని తిరుపతి జిల్లా తూపిలి తెలుగుదేశం పార్టీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి పేర్కొన్నారు.ప్రతినెలా ఒకటవ తేదీ సచివాలయం సిబ్బందితో కలిసి సామాజిక పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బంది శ్రీమతి హిమజ ,శ్రీమతి షాలినితో కలిసి పింఛన్లు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, ఎంతమంది పిల్లలు ఉన్నా అంతమంది పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ చేయడం జరిగిందని మిగిలిన హామీలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు 20వేల రూపాయలు ఉచితంగా ఇచ్చే పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆగస్టు నెలలో అమలు చేయడం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర బిజెపి నేత ఎన్నికలలో రామచంద్రపురం బిజేపి శ్రేణులు

### అభినందించిన హాసన్ బాధ సర్పంచ్ సతీష్ రావు

రామచంద్రపురం, జూలై 1(శ్రీచక్ర)విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్ష ఎన్నికల్లో రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి శ్రేణులు హాజరైయ్యారు.ఈసందర్భంగాఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా ఎన్నికైన పి. వి.ఎన్.మాధవ్ ని ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరై వారిని అభినందించారు.ఈసంర్భంగా బిజేపి నాయకులు,రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, కోనసీమ జిల్లా బీజేపీ కిసాన్ కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బిజెపి ఇంచార్జి కర్రి చిట్టిబాబు,రామచంద్రపురం నియోజక వర్గ బిజెపి కో కన్వీనర్ సలాది చంద్రశేఖర్,రామచంద్రపురం మండలం రూరల్ ప్రెసిడెంట్ ఆకేటి శ్రీ కృష్ణ,గంగవరం మండలం బిజెపి ప్రెసిడెంట్ కొప్పిశెట్టి చంద్రరావు (చందు),కాజులూరు మండల బిజెపి ప్రెసిడెంట్ పుణ్యమంతుల శివాజీ, రామచంద్రపురం టౌన్ బిజెపి ప్రెసిడెంట్ దునే శ్రీనివాస్, గంగవరం మండల సోషల్ మీడియా కన్వీనర్ అవసరాల వెంకట రమణ మూర్తి, కాజులూరు మండల మాజీ మండలాధ్యక్షులు,బిజెపి సీనియర్ నాయకులు సలాది వీరబాబు,పి.కె.రాఘవేంద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.



## రామచంద్రాపురం డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు .ముందస్తు అనుమతులు తప్పనిసరి



రామచంద్రపురం,జూలై 1(శ్రీచక్ర) రామచంద్రా పురం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు జూలై 1-నుండి 31వ వరకు అమల్లో ఉన్నట్లు రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రామచంద్రాపురంసబ్ డివిజన్ పరిధిలోఉన్నరామచంద్రాపురం, ద్రాక్షా రామం,పామర్రు,మం డపేట టౌన్,,మండపేటరూరల్,అంగర, రాయవరం ,పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు అమలులో ఉన్నట్లు పేర్కొన్నారు .వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదని తెలిపారు. అటువంటివి ఏమైనా జరపాలనుకుంటే రామచంద్రా పురం పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ముందుగా అనుమతి పొందాలని పేర్కొన్నారు.ఈ విషయాన్ని అందరూ గమనించి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు ఎప్పటిలాగే అందరూ సహకరించవలసిందిగా ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## యాక్షన్ లోకి దువ్వాడ శ్రీ వాణి

శ్రీకాకుళం, జూలై 1,శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో దువ్వాడ కుటుంబం పేరు మార్మోగకుండా ఉండదు. కొన్ని నెలల క్రితం వరకూ దువ్వాడ శ్రీనివాస్, ఆయన భార్య దువ్వాడ వాణి, వేరే పక్కన వార్తల్లో నిలిచిన మాధురి.. ఈ ముగ్గురి పేర్ల చుట్టూ నిత్యం చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మాధురితో దువ్వాడ శ్రీనివాస్ పెళ్లి వార్త బయటకు వచ్చాక, దువ్వాడ వాణి ఎమోషనల్‌గా స్పందించి దీక్ష చేపడుతున్నారని అనుకుంటే పొరపాటే. అయితే ఫ్యామిలీ వివాదం సమయంలో వాణి చేసిన మాటలు ఎంత సంచలనంగా మారాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయినా కాలం గడిచింది, రాజకీయాలు నిశ్శబ్దంగా మారాయి. అయితే ఇప్పుడు అదే వాణి.. మళ్లీ ఒక బిగ్ యాక్షన్‌కు



సిద్ధమవుతున్నారు. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఇప్పుడు దువ్వాడ వాణి ఏం చేయబోతున్నారు అంటే.. ఆమె ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నారు. రాజకీయంగా పునరుజ్జీవించేందుకు కాదు, ప్రజాప్రయోజనాల కోసం. టెక్కలి మండలంలోని సర్పంచ్‌ల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, తన నియోజకవర్గ ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె ప్రకటించారు. దివ్వెల మాధురితో దువ్వాడ శ్రీనివాస్ వివాహం జరిగినప్పటికీ, వాణి మాత్రం రాజకీయాల్లో నిలబడటం, పబ్లిక్ ఫోరమ్స్‌లో తన హక్కును వినిపించుకోవడం ఆపలేదు. ఒక మహిళగా, ఒక నాయకురాలిగా ఆమె తన స్థానం కోల్పోకుండా ముందుకెళ్తుండటం గమనార్హం. ప్రస్తుతం వాణి టెక్కలి జెడ్పీటీసీగా కొనసాగుతుండగా, పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే సమయంలో, సర్పంచ్‌లు చేస్తున్న అభివృద్ధి పనులను అధికారులు అడ్డుకుంటున్నారని, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తున్నారని, నిధులు విడుదల చేయడంలో అన్యాయం జరుగుతోందని, మౌలిక వసతుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఆమె వాదిస్తున్నారు. టెక్కలిలోని ప్రధాన పంచాయతీలో పారిశుద్ధ్యం దారుణంగా ఉందని, 196 హుదూద్ ఇళ్లకు ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్లు లేవని వాపోయారు. ఈ పరిస్థితుల్లో అధికారులు స్పందించకపోతే, తాను టెక్కలిలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. దీనిపై వాణి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టెక్కలి నియోజకవర్గం నుంచే కాక, జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. మరీ ముఖ్యంగా ఆమె గతంలోని వ్యక్తిగత సంఘటనలు.. దువ్వాడ శ్రీనివాస్, మాధురితో వివాహం అంశాలు పక్కన పెట్టుకొని, ఇప్పుడు పూర్తిగా ప్రజాప్రయోజనాల కోసం బాటపడినట్టు కనిపిస్తుండటమే చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నేతలుగా దువ్వాడ శ్రీనివాస్, వాణిలకు గతంలో మంచి ప్రజాదరణ ఉండేది. అయితే వ్యక్తిగత విభేదాల కారణంగా ఇద్దరూ వేర్వేరుగా రాజకీయంగా కొనసాగుతున్నారు. ఇప్పుడు వాణి తిరిగి రాజకీయంగా పట్టు సాధించేందుకు ప్రజల సమస్యలను ముందుకు తెచ్చి పోరాట పథకంలోకి వెళ్లినట్టు కనిపిస్తోంది. ప్రజలే ఈ వ్యవహారాన్ని ఎలా స్వీకరిస్తారన్నది వేచి చూడాలి. దివ్వెల మాధురితో దువ్వాడ శ్రీనివాస్ పెళ్లి వ్యవహారం వల్ల రాజకీయంగా ఆమె నష్టపోయారా? లేక అదే సంఘటన ఆమెను మరింత బలంగా మార్చిందా? అన్న ప్రశ్నలకు సమాధానం ఈ ఆమరణ దీక్షతో తేలే అవకాశం ఉంది. ఒకవేళ వాణి దీక్షతో ఏదైనా సమస్య పరిష్కార దిశలో కదలిక వస్తే, అది ఆమెకు రాజకీయంగా మరింత ఊపిరిగా మారనుంది

## కెంగువలో పాఠశాల భవనాలకు ప్రారంభించిన మంత్రి కొండపల్లి

విజయనగరం,విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో, ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పి 4 విదానం లో రౌండ్ టేబుల్ ఇండియా 55 లక్షలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రాధమికోన్నత పాఠశాల భవనాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేసారు . ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ , కెంగువ లో విద్యార్థులు పడుతున్న బాదలు , ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని తాను ఎలాగైనా వారి సమస్య పరిష్కరించాలనే లక్ష్యం తో రౌండ్ టేబుల్ 77 కు చెందిన వ్యక్తులతో మాట్లాడి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు .

## అక్రమ మట్టిని తరలిస్తున్న మూడు లారీలు సీజ్ ఆర్డీవో దేవరకొండ అఖిల





రామచంద్రపురం, జూలై 1( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గం కె గంగవరం మండలం మసకపల్లి రెవెన్యూ పరిధిలో అక్రమంగా గుండ్రు మట్టిని తరలిస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకని చీట్ చేసినట్లు రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. ఈ మేరకు మంగళవారండాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు నిర్వ హిస్తున్నట్లు వదంతులు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్ లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలన్న సూచనలకు అనుగుణంగా మంగళ వారం కె గంగవరం మండల పరిధిలోని మసక పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 8 లో ఏటుగ ట్టు వద్ద అక్రమంగా గోండ్రు మట్టిని మూడు లారీలలో తరలిస్తుండగా మూడు లారీలను సీజ్ చేసినట్లు తెలిపారు జిల్లా కలెక్టర్ ఆదేశా నుసారం మంగళవారం ఆర్డిఓ నేతృత్వం లోని రెవెన్యూ పోలీసు అధికా రుల బృందం ఆకస్మిక తనిఖీ లు నిర్వహించగా అక్రమంగా ఎటువంటి అనుమతులు పొంద కుండా గోండ్రు మట్టి తరలిస్తున్న సీట్ చేసి జిల్లా భూగర్భ గనుల శాఖకు అప్పగిం చడం జరిగిందని ఆర్డిఓ అఖిల తెలిపారు. ఈ తనిఖీలు తాసిల్దారు శ్రీరామ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు వీఆర్వో, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఎమ్మెల్యేలకు ఫుల్ క్లాస్

విజయవాడ, జూలై 1, రాబోయే 2029 ఎన్నికలకు టీడీపీ ఇప్పటి నుంచే రెడీ అవుతోందా? పదే పదే నేతలతో సమావేశాలు అందుకేనా? ఓ వైపు సర్వేలు.. మరోవైపు సమావేశాలు పెట్టి హెచ్చరికల వెనుక కారణం అదేనా? కొందరు నేతలు తీరు మారడం లేదా? అందులో పాతవారితోపాటు కొత్తవారు ఉన్నారా? పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన సమావేశానికి 56 మంది డుమ్మా కొట్టడంపై ఆయా నేతలు సీఎం చంద్రబాబు లిస్టులో ఉన్నట్టేనా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం.. సాయంత్రం 6 గంటలకు సాగింది. ఏడాది పాలన గురించి నేతలు, కార్యకర్తలకు వివరిస్తూనే.. అమలు చేసినవాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యర్థుల వ్యూహాలు.. గతంలో జరిగిన కొన్ని పరిణామాలను వివరించారు. సుమారు రెండు గంటలు మాట్లాడిన సీఎం చంద్రబాబు.. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు చురకలు అంటించారు. రాబోయే రెండు, మూడు దశాబ్దాల నాటికి అవసరమైన నాయకత్వాన్ని తీసుకురావాలనే ఆలోచనతో అవకాశం ఇచ్చానని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పని చేయకుండా సలహాలకే పరిమితమైన ఎమ్మెల్యేలు రాబోయేది కష్టకాలమని స్పష్టంగా చెప్పేశారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి మద్దతు ఉన్నవారికే పదవులైనా, టికెట్లయినా ఇస్తామని మరోసారి క్లారిటీ ఇచ్చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నానని తెలిపారు. సర్వేలను విశ్లేషించి బేరీజు వేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. రోజుకు నలుగురు ఎమ్మెల్యేలతో వన్ టు వన్ మాట్లాడుతున్నానని వెల్లడించారు. మీరు చెప్పింది వింటానని, తాను సలహాలు ఇస్తానని అన్నారు సీఎం చంద్రబాబు. నేతలు మారితే ఓకేనని.. మారకుంటే ఆ విధంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని కాస్త నవ్వుతూ సున్నితంగా హెచ్చరించారు. ఎలాంటి మొహమాటానికి తావు లేదని తేల్చి చెప్పేశారు. కేవలం ఎమ్మెల్యేలకు మాత్రమేకాదని, సొంత నియోజకవర్గంలో ఎవరు తప్పుచేసినా పక్కన పెడతానని అన్నారు. ఇప్పుడు గెలిచిన వాళ్లు మళ్లీ మళ్లీ గెలవాలన్నదే నా ఆశ అని, పార్టీలో నేతలంతా ఆ విధంగా ఆలోచన చేయాలని సూచన చేశారు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా వద్దని, గత ఎన్నికల్లో ఎక్కువ ఖర్చు పెట్టిన వాళ్లు కేవలం 11 సీట్లకు పరిమితమయ్యారని గుర్తు చేశారు. సమావేశానికి గైర్హాజరు కావడానికి కారణాలు తెలుసుకున్నారు అధినేత చంద్రబాబు. కొందరు విదేశీ పర్యటనలని చెప్పారు. మరికొందరు దేవుడి దర్శనానికి వెళ్తున్నామని సమాధానం ఇచ్చారని వివరించారు. నేతలు నియోజకవర్గాల ప్రజలకు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఆహ్వానితుల్లో 56 మంది హాజరుకాలేక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు. ఆదివారం సమావేశానికి ఎంతమంది వచ్చారు? సంతకాలు పెట్టి ఎంతమంది వెళ్లారు? చివరివరకు ఎంతమంది ఉన్నారో తన వద్ద జాబితా ఉందని హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాలకు రానివారు నియోజకవర్గాల్లో ఏం తిరుగుతారు? ఏం పని చేస్తారని మండిపడ్డారు. మొత్తానికి కొందరు నేతలకు అధినేత రెండో హెచ్చరిక ఇచ్చారని అంటున్నారు.

## బనకచర్లకు బ్రేక్...

కర్నూలు, జూలై 1, బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ ప్రభుత్వానికి షాక్ తగిలింది. కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది. అలాగే ఏపీ ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. 3000 టీఎంసీల గోదావరి జలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయని.. ఇందులో 200 టీఎంసీలు ఉపయోగించుకునేందుకు ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదించింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్రం షాకిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు నిరాకరించింది. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుపై పలు అభ్యంతరాలు వచ్చాయన్న కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ తీర్పును పరిశీలించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు కావాల్సిన పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నారని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపింది.బనకచర్ల ప్రాజెక్టు లో నీటి నిల్వపై కేంద్ర ప్రభుత్వంతో అధ్యయనం చేయించడం సహా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన అనుమతులు, పర్యావరణంపై ఏ మేరకు ప్రభావం పడుతుందనే దానిపై అంచనా వేసిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడానికి అవకాశం ఉంటుందని కమిటీ వెల్లడించింది. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల ఇవ్వలేమన్న కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలపై కేంద్ర జలసంఘం సాయంతో వరద నీటి లభ్యతపై అధ్యయనం చేయాలని సూచించింది. అలాగే గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రైబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల పంపిణీపై సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి తీసుకోవాలని తెలిపింది. సముద్రంలో వృథాగా కలిసే గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించి.. రాయలసీమను సస్యశ్యామ లం చేయాలని ఏపీ ప్రభుత్వం భావించింది. గోదావరి నుంచి 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోం దని.. ఇందులో 200 టీఎంసీల నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఉపయోగించుకుంటే రాయలసీమకు మేలు కలుగుతుందని సీఎం చంద్రబాబు పదే పదే చెప్తున్నారు.ండు రాష్ట్రాలూ ఉపయోగించుకోవాలని చంద్రబాబు సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ. 80,000 కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచించింది .అయితే, తెలంగాణ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్, పునర్విభజన . అభ్యంతరం తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ.. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు నిరాకరించింది.

## పొలిటికల్ కేసు స్టడీగా రావెల స్టోరీ



గుంటూరు, జూలై 1, ఆంధ్రప్రదేశ్ లో 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి పార్టీల నుంచి అనేక మంది కొత్త వారు ఎన్నికయ్యారు. దాదాపు ఎనభై మందికి పైగా ఫస్ట్ టైం ఎమ్మెల్యేగా గెలిచిన వారున్నారు. అయితే వీరు మాజీ మంత్రి రావెల కిశోర్ బాబును చూసి నేర్చుకోవాలి. అలాగే తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన వారు సయితం రావెల కిశోర్ బాబును చూసి తమ నడవడికను మార్చుకోవాలి. ఎందుకంటే రావెల కిశోర్ బాబు రాజకీయ జీవితం కొత్తతరం నేతలకు ఒక పాఠంగా చెప్పొచ్చు. ఎలా ఉండకూడదో ఆయనను చూసి నేర్చుకోవాలి. గెలుపు తర్వాత గర్వం తలెకెక్కితే రావెలకు పట్టిన గతి భవిష్యత్ లో పట్టక తప్పదన్నది ఆయనను చూసి నేర్చుకోవాలి. 2014లో రావెల కిశోర్ బాబు రాజకీయ రంగంలోకి కాలు మోపారు. మచి టైం చూసుకుని ఐఆర్ఎస్ అధికారిగా ఉన్నప్పటికీ సామాజికవర్గం కోణంలో రావడంతోనే తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్తిపాడు టిక్కెట్ ను కొట్టేశారు. తొలి ఎన్నికలోనే గెలుపు రుచి చూశాడు. దానికి తోడు ఐఆర్ఎస్ మాజీ అధికారి కావడంతో 2014మంత్రివర్గంలో చంద్రబాబు రావెల కిశోర్ బాబుకు తన కేబినెట్ లో చోటు కల్పించారు. కుదురుగా ఉండాల్సిన రావెల గెలుపు తర్వాత మైండ్ సెట్ మారిపోయింది. ఇక నియోజకవర్గంలో తనకు తిరుగు లేదని భావించారు. కార్యకర్తలు తన వెంట తిరుగుతుండటాన్ని బలహీనతగా భావించి కష్టాలను కొని తెచ్చుకున్నారు. ఫలితంగా మంత్రి పదవిని పోగొట్టుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరి మళ్లీ ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి చేరి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. తర్వాత 2022 లలో భారతీయ జనతా పార్టీలో చేరారు. తర్వాత 2024 ఎన్నికలకు ముందు రావెల కిశోర్ బాబు బీజేపీకి రాజీనామాచేసి వైసీపీలో చేరిపోయారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీలో చేరి ఏపీ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. 2024లో వైసీపీ ఓటమి పాలు కావడంతో కొన్నాళ్ల నుంచి ఆయన కనిపించడం లేదు. వైసీపీకి కూడా రాజీనామా చేశారు. ఇలా దాదాపు అన్నిపార్టీలను చుట్టివచ్చిన రావెల కిశోర్ బాబు 2014 లో ఫస్ట్ టైం ఎమ్మెల్యేగా గెలిచిన వేసినతప్పటుడుగులతో ఇప్పటి వరకూతిరిగి కోలేదు. ఆయన కెరీర్ ఫస్ట్ టైం ఎమ్మెల్యేలకు కేస్ స్టడీస్ గా చెప్పాలి.

## వివాదంలో రాయుడు మిలటరీ హోటల్

విశాఖపట్టణం, జూలై 1, విశాఖపట్నం హైవే రోడ్డుపై ఓ మిలిటరీ హోటల్ తిరుమల శ్రీవారి ఆలయ గర్భగుడి నమూనాతో నిర్మించబడి ఉండటమే కాకుండా, జయ ? విజయులు, బంగారు వాకిలి, రాములవారి మెడ, కులశేఖర పడి లాంటి కీలక ప్రాంతాల నమూనాలతో సెట్ వేయడంపై కొందరు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్ లో నాన్ వెజ్ వంటలు వడ్డించడంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను కించపరచినట్లు భక్తులు మండిపడుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. తిరుమల గర్భాలయ నమూనా.. అది కూడా హోటల్ రూపంలో? తిరుమల శ్రీవారి గర్భాలయం అంటే ప్రతి హిందువు గుండె లోతుల్లో భక్తితో నిలిచే పవిత్ర స్థలం. అలాంటి ఆలయ నమూనాను ఉపయోగించి ఓ హోటల్ నిర్మించడం, అందులో మాంసాహార వంటకాలను వడ్డించడం నిజంగా శ్రద్ధా సంపన్న భక్తుల మనసును కలచివేస్తోందన్నది అసలు ఆరోపణ. ఇది సాధారణ వ్యాపార చర్యగా కాకుండా, భక్తుల మత భావనలపై అవమానకరంగా ఉందంటూ భక్తులు మండిపడుతున్నారు. రాయుడు మిలిటరీ హోటల్ విశాఖపట్నం హైవే పక్కనే ఉన్న ఈ హోటల్ పేరు రాయుడు మిలిటరీ హోటల్. హోటల్ నిర్మాణం మొత్తం తిరుమల ఆలయ నిర్మాణ శైలిలోనే తీర్చిదిద్దబడినట్లు వైరల్ అవుతోంది. హోటల్ గేటు వద్ద జయ, విజయుల విగ్రహాలు, ఆలయ సుదర్శన చక్రం గుర్తులు, స్వామివారి మెడలో కనిపించే అలంకరణలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తీర్థక్షేత్ర గౌరవాన్ని వ్యాపారానికి వాడకూడదన్నది పలువురి భక్తుల వాదన. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం కేవలం ఆలయం ఒక్కటే కాదని, అది కోట్లాది హిందువుల ఆధ్యాత్మిక కేంద్రం. అలాంటి గర్భాలయ నమూనాను ఓ మాంసాహార హోటల్ కు ఉపయోగించడమేంటని ప్రశ్నిస్తున్నారూ భక్తులు. ఇది భక్తుల మనోభావాలను గాయపరచడమే కాకుండా, తిరుమల ఆలయం గొప్పతనాన్ని, గౌరవాన్ని తక్కువ చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీటీడీకి ఫిర్యాదు చేసిన కిరణ్ రాయల్ ఈ హోటల్ వ్యవహారాన్ని గుర్తించిన తిరుపతికి చెందిన కిరణ్ రాయల్ అనే భక్తుడు తక్షణమే టీటీడీ ఈఓ, చైర్మన్ లకు ఫిర్యాదు చేశారు. ఫోటోలు, వీడియోలతో సహా పూర్తి సమాచారం అందజేశారు. ఇదే కాకుండా హోటల్ ఎదుట నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. తిరుమల గౌరవాన్ని ఈ స్థాయిలో తక్కువ చేస్తూ ఎవరు వ్యాపారం చేసినా సహించేది లేదని స్పష్టంగా హెచ్చరించారు ఇలా శ్రీవారి గర్భాలయ నమూనాలతో నాన్ వెజ్ హోటళ్లు పెరిగిపోతే ఇది భక్తుల మనోభావాలపై ఘాతుకమే అవుతుంది. దీని పట్ల చర్యలు తీసుకోకపోతే, రాయుడు హోటల్ ఎదుట భక్తులంతా పెద్ద సంఖ్యలో ఆందోళన చేయడానికి సిద్ధం అవుతున్నామని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. ఆయన మాటలకు సోషల్ మీడియాలోను భారీ స్పందన లభిస్తోంది. ఇలాంటి వాటిని అరికట్టడానికి టీటీడీ దృష్టి పెట్టాలని కిరణ్ రాయల్ అభిప్రాయపడుతున్నారు. కిరణ్ రాయల్ చేసిన ఫిర్యాదులో మరో కీలక అంశం ఉందని కొందరు భక్తులు వాదిస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు విజిలెన్స్ స్పెషల్ వింగ్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుమల ఆలయ నమూనాలు, గుర్తులు ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో పర్యవేక్షించే ప్రత్యేక బృందం అవసరం అన్నది ఆయన అభిప్రాయం. మండిపడుతున్న భక్తులు ఈ ఘటనపై సోషల్ మీడియా ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి ప్రతిష్ఠను బిజినెస్‌కు వాడుకోవడం ఎంతవరకు న్యాయం? ఇది కేవలం అలంకరణ కాదు.. మతసంబంధిత గౌరవాన్ని తృణప్రాయంగా తీసుకునే చర్య అంటూ స్పందిస్తున్నారు. కొన్ని సంఘాలు ఇప్పటికే హోటల్ మూసివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇలాంటివి కామెంట్స్ చేస్తున్నారు. అందుకే టీటీడీ ఈ విషయంలో తక్షణమే స్పందించి, న్యాయపరంగా, పరిపాలనా పరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. తిరుమల గర్భాలయ నమూనా పేరుతో మాంసాహార హోటల్ నడిపిన వ్యవహారం పునరావృతం కాకుండా.. టీటీడీ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు




# రెండో టెస్ట్.. ఫ్రీగా ఎలా చూడాలంటే..?

ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో శుభారంభం అందుకోలేకపోయిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్‌తో టీమిండియా తలపడనుంది. తొలి టెస్ట్ పరాజయం నేపథ్యంలో ఈ మ్యాచ్ ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో భారత్ ఉంది. ఇప్పటికే విజయమే లక్ష్యంగా టీమిండియా సన్నాహకాలు పూర్తి చేసుకుంది. జట్టులో చేయాల్సిన వ్యూహాత్మక




మార్పులపై ఫోకస్ పెట్టింది.వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి కల్పించే అవకాశం ఉంది. తొలి టెస్ట్ ఆడని నితీష్ కుమార్ రెడ్డితో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. శార్దూల్ ఠాకూర్‌పై వేటు వేయనున్నారు.భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ బుధవారం (జూలై 2న) భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవుతుంది. అరగంట ముందుగానే టాస్ వేయనున్నారు. ఈ మ్యాచ్‌లను ఓటీటీ ఫ్లాట్‌ఫామ్స్ జియో హాట్‌స్టార్, సోనీ లివ్‌తో పాటు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్స్‌లో చూడవచ్చు. డీడీ స్పోర్ట్స్‌లో ఉచితంగా ఎలాంటి రుసుము లేకుండా ఈ మ్యాచ్‌లను వీక్షించవచ్చు. సాధారణంగా విదేశీ గడ్డపై జరిగే మ్యాచ్‌లను డీడీ స్పోర్ట్స్‌లో ప్రసారం చేయరు. కానీ ఈ సిరీస్‌ను ఫ్రీగా ప్రసారం చేయనున్నారు. జియో టీవీ యాప్‌లో సోనీ టెన్ 1 ఛానెల్‌ను సెలెక్ట్ చేసుకోని ఫ్రీగా ఈ మ్యాచ్ చూడవచ్చు.తొలి టెస్ట్ తరహాలోనే ఇంగ్లండ్ తమ తుది జట్టును రెండు రోజుల ముందే ప్రకటించింది. తొలి టెస్ట్ ఆడిన జట్టునే రెండో టెస్ట్‌కు కొనసాగించింది. జోఫ్రా ఆర్చర్ జట్టులోకి వచ్చినా అతనికి అవకాశం ఇవ్వలేదు.ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(కీపర్), బెన్ స్టోక్స్(కెప్టెన్), క్రిస్ వోక్స్, జోష్ టోంగ్, బ్రైడన్ కార్స్, షోయబ్ బషీర్.ఎౌెఅ లబ ఇౌఉ: స్టార్ ప్లేయర్‌కు నిరాశే.. భారత్‌తో రెండో టెస్ట్ ఆడే ఇంగ్లండ్ తుది జట్టు ఇదే!ఎౌెఅ లబ ఇౌఉ: స్టార్ ప్లేయర్‌కు నిరాశే.. భారత్‌తో రెండో టెస్ట్ ఆడే ఇంగ్లండ్ తుది జట్టు ఇదే!భారత్ తుది జట్టు(అంచనా): యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రిషభ్ పంత్(కీపర్), రవీంద్ర జడేజా/వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా/ఆకాశ్ దీప్/అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ.

# వైట్, రెడ్ బాల్‌తో భారత్ ప్రాక్టీస్.. ఎందుకంటే?

ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌కు ముందు టీమిండియా పేసర్లు రెడ్, వైట్ బాల్‌తో ప్రాక్టీస్ చేస్తున్నారు. సుదీర్ఘ కాలం వైట్ బాల్ క్రికెట్ ఆడిన భారత ఆటగాళ్లు ఆ అలవాట్లను వదిలించుకోవడంతో పాటు టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ప్రాథమిక బౌలింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు రెండు బంతులతో ప్రాక్టీస్ చేస్తున్నారు.ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు భారత పేసర్లు ఎక్కువగా వైట్‌బాల్ క్రికెట్ ఆడారు. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తర్వాత ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్ ఆడిన టీమిండియా.. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడింది. అనంతరం రెండు నెలల పాటు ఐపీఎల్ 2025 సీజన్ జరగ్గా.. భారత పేసర్లంతా ఈ మెగా టోరనీ ఆడారు.వైట్‌బాల్ ఫార్మాట్‌లో బౌలర్లు తరచుగా వికెట్లు తీయడం లేదా పరుగులు కట్టడి చేయడంపై మాత్రమే దృష్టి పెడతారు. అందుకోసం బౌలింగ్‌లో వేరియేషన్స్ చూపించే ప్రయత్నం చేస్తారు. స్లో బాల్స్, షార్ట్ పిచ్ డెలివరీలను సంధిస్తుంటారు. అయితే టెస్ట్ క్రికెట్ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో బౌలర్లు ఎక్కువగా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫార్మాట్‌లో వికెట్లు తీయాలంటే సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయడంతో పాటు బంతిని స్వింగ్ చేయాలి. సీమ్‌ను ఉపయోగించి బంతిని స్వింగ్ చేసే నైపుణ్యం తెలియాలి. అయితే వైట్ బాల్ క్రికెట్ అలవాట్లు రెడ్ బాల్ క్రికెట్‌లో ప్రతికూలంగా మారే అవకాశం ఉంది.ఉదాహరణకు వైట్-బాల్‌తో ఎక్కువ స్వింగ్ చేయలేం. బంతిపై ఉన్న సీమ్ త్వరగా దెబ్బతింటుంది. కానీ రెడ్-బాల్ క్రికెట్‌లో బంతి అంత త్వరగా దెబ్బతినదు. అంతేకాకుండా రెడ్ బాల్ ఎక్కువ స్వింగ్ అవుతుంది.ఈ క్రమంలోనే భారత పేసర్లకు రెడ్ బాల్, వైట్ బాల్ వ్యత్యాసం తెలియజేసేందుకు రెండు బంతులతో ప్రాక్టీస్ సెషన్ నిర్వహించినట్లు టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే తెలిపారు. ఈ ప్రాక్టీస్ వల్ల టెస్ట్ ఫార్మాట్‌కు సంబంధించిన ప్రాథమిక విషయాలు తెలిసొస్తాయని చెప్పారు. వైట్ బాల్ ఫార్మాట్‌పై వ్యూహాలు పనికిరావని, టెస్ట్ క్రికెట్‌లో లైన్ అండ్ లెంగ్త్, సీమ్ పొజిషన్, స్వింగ్ చేయడం ఎంత ముఖ్యమో అనే విషయం ఆటగాళ్లకు అర్థమవుతుందన్నారు. వైట్ బాల్ ఆరంభంలో మాత్రమే స్వింగ్ అయితే.. రెడ్ బాల్ ఎక్కువ సేపు స్వింగ్ చేయవచ్చనే విషయం కూడా ఆటగాళ్లకు తెలుస్తోందని ర్యాన్ టెన్ చెప్పుకొచ్చారు. టెస్ట్ క్రికెట్‌కు సమర్థవంతంగా సిద్ధమవ్వాలనే లక్ష్యంతోనే ప్రాక్టీస్‌లో ఈ పద్ధతిని అనుసరిస్తున్నామని చెప్పారు.





# పంచ్ పడితే పతకమే.. జాతీయ పోటీల్లో బాక్సర్ మీర్జా అలీ బేగ్ దూకుడు

చార్మినార్: రింగ్ లోకి దిగి పంచ్ విసిరితే ప్రత్యర్థికి చుక్కలే.. చదువుల్లోనే కాదు.. ఆటల్లోను ముందు వరుసలో ఉంటామని నిరూపిస్తున్నారు పాత బస్తీ విద్యార్థులు. మెరుగైన ప్రదర్శన ద్వారా క్రీడా లోకంలో గుర్తింపు సాధిస్తూ తోటి విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు. ఆటపై ఇష్టం.. నిరంతరం సాధన..ఓరిమితో కృషి చేసేవారి విజయ పరంపరకు ఆర్థిక పరిస్థితులు అడ్డురావని నిరూపిస్తున్నారు. ఒకవైపు ఆటల్లో దూసుకుపోతు.. మరోవైపు చదువులోను విశేషంగా రాణిస్తు అందరి చేతా ఔరా.. అనిపించేలా చేస్తున్నాడు మీర్జా అలీ బేగ్.చిన్నతనం నుంచే మీర్జా అలీ బేగ్‌కు బాక్సింగ్ అంటే ఇష్టం. కొడుకు ఆసక్తి గుర్తించిన తండ్రి.. జాతీయ క్రీడాకారుడైన సయ్యద్ హాబీబ్ ముస్తాఫాను సంప్రదించాడు. మీర్జా అలీ బేగ్‌కు మెలకువలను నేర్పి




అతన్ని ప్రోత్సహించాడు కోచ్. అవకాశాన్ని అందిపుచ్చుకున్న మీర్జా ఆలీబేగ్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీలో పాల్గొని పతకాలు గెలుచుకున్నాడు. కోచ్ హాబీబ్ నమ్మకాన్ని నిలకబెట్టాడు. బరిలో దిగిన ప్రతి బౌట్‌లోనూ పతకాలు ఒడిసి పట్టాడు. వరల్డ్ చాంపియన్, మేటి బాక్సర్ నికత్ జరిన్ తరహా బాక్సింగ్‌లో దూసుకుపోతు తెలంగాణ రాష్ట్ర పేరును జాతియ స్థాయిలో మెరిపిస్తున్నాడు.బాక్సింగ్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గనే అవకాశం దక్కించుకున్నాడు మీర్జా ఆలీ బేగ్. తండ్రి నుంచి స్ఫూర్తి పొందిన ఇతడు ఎప్పటికప్పుడు తన ప్రతిభను మెరుగులు దిద్దుకుంటూ మరింతగా రాణించడానికి పాఠశాల అనంతరం మిగిలిన సమయాన్ని సాధన కోసం కేటాయిస్తూ రాటుదేలుతున్నాడు. పాతబస్తీ బండ్లగూడ వద్దనున్న ర???సింగ్ సన్ హై స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మీర్జా ఆలీ బేగ్, 5వ తరగతి చదువుతున్నప్పటి నుంచే బాక్సింగ్‌లో సాధన ప్రారంభించాడు.తండ్రి మీర్జా జావేద్ బేగ్, చెల్లి, ఇద్దరూ క్రీడల్లో ప్రతిభావంతులే. క్రీడకారులకు దక్కుతున్న గౌరవాన్ని దగ్గర నుంచి గమనించిన మీర్జా ఆలీ బేగ్ ఎలాగైన తనూ ఈ ఆటలో సత్తాచాటాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అడుగులు వేసి రెండేళ్లలో రాష్ట్ర స్థాయి పోటీల్లో తన సత్తా చాటాడు. మొదటి సంవత్సరమే బంగారు, కాంస్య పతాకం సాధించి తన పట్టుదలను నిరూపించాడు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన ప్రతిభ చాటుతూ పలువురి ప్రంశలు అందుకుంటున్నాడు.2025 జూన్ 19 నుంచి 25వరకు హార్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగిన జాతియ స్థాయి పోటీలో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిథ్యం వహిస్తు అండర్ 52, 54, కేజీ బరిలోకి దిగి కాంస్య పతకం అందుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక పోటీలో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు.ఆటలో విజయం సాధించడానికి మెరుగైన ప్రదర్శన చేయడానికి నిర్ధిష్ట విధానం ఏమీ ఉండదు. పట్టుదల, అంకితభావంతో ప్రయత్నిస్తే ఏ క్రీడల్లోనైనా విజయాలను సాధించవచ్చు, క్రీడల్లో గెలుపోటములు జీవితంలో కూడా ఎన్నో పాఠాలు నేర్పుతాయని కోచ్ హాబీబ్ అన్నారు.

# ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వేలానికి రిషబ్ పంత్




న్యూఢిల్లీ: గత ఏడాది ఐపీఎల్ వేలంలో రిషబ్ పంత్ 27 కోట్లకు అమ్ముడుపోయాడు. లక్నో సూపర్ గెయింట్స్ జట్టు అతన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా అతను వేలానికి సిద్ధం అయ్యాడు. ఆ వేలంలోనూ అతనికి భారీగా ధర పలికే అవకాశం ఉన్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ కోసం మొత్తం 8 జట్లు పోటీపడనున్నాయి. దీంట్లో రిషబ్ పంత్ తో పాటు ఐపీఎల్‌లో ఆడిన కొందరు స్టార్ ఆటగాళ్లు వేలానికి ఉన్నారు. ప్రియాన్ష్ ఆర్యా, దిగ్వేశ్ రాథీ లాంటి క్రికెటర్లు కూడా ఉన్నారు. జూలై 6, 7 తేదీల్లో ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మరో రెండు జట్లు కొత్తగా జతకూడినట్లు ఇవాళ డీడీసీఏ ప్రకటించింది. దీంతో ఆ జట్ల సంఖ్య 8కి చేరింది. రిషబ్ పంత్, దిగ్వేశ్, ప్రియాన్ష్, ఇశాంత్ శర్మ, ఆయుష్ బదోనీ, హర్షిత్ రాణా, హిమ్మత్ సింగ్, సుయాశ్ శర్మ, మయాంక్ యాదవ్, అనుజ్ రావత్ డీపీఎల్‌లో ఆడనున్నారు.

# ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో స్మృతి మందాన




దుబాయ్: భారత మహిళా క్రికెటర్ స్మృతి మందానఐసీసీ టీ20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మందాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మందాన పోషించింది. మందాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది.లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మందాన తన కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. దీంతో ఆమె మూడవ ర్యాంక్‌లో నిలిచింది. వెస్టిండీస్‌కు చెందిన హేలే మాథ్యూస్ 774, ఆస్ట్రేలియా బ్యాటర్ బేత్ మూనీ 794 పాయింట్లతో రెండో, మొదటి స్థానల్లో నిలిచారు. భారతీయ మహిళా క్రికెటర్లలో షఫాలీ వర్మ, హర్లిన్ డియోల్.. రాణించారు. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్లలో పాకిస్తాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్.. టీ20ల్లో టాప్‌లో నిలిచింది. 44 రేటింగ్ పాయింట్లతో ఆమె అగ్ర స్థానంలో ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది.

# కౌంటీ క్రికెట్‌లో 126 ఏళ్ల రికార్డు బ్రేక్

లండన్: ఇంగ్లీష్ కౌంటీ చాంపియన్‌షిప్‌డివిజన్ వన్ క్రికెట్‌లో కొత్త రికార్డు నమోదు అయ్యింది. సర్రే జట్టు ఓ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 820 రన్స్ చేసింది. ఆ జట్టు 800 స్కోర్ దాటడం .. కౌంటీ టోర్నీలో ఇది రెండోసారి.




దీంతో 126 ఏళ్ల క్రితం నమోదు అయిన రికార్డును సర్రే జట్టు బ్రేక్ చేసింది. దర్హమ్‌తో జరిగిన మ్యాచ్‌లో సర్రే 9 వికెట్లు కోల్పోయి 820 రన్స్ చేసింది. సోమవారం ఈ కొత్త రికార్డు నమోదు అయ్యింది. 1899లో అంటే 126 ఏళ్ల క్రితం కౌంటీ క్రికెట్‌లో సర్రే జట్టు 811 రన్స్ స్కోర్ చేసింది.సోమవారం జరిగిన మ్యాచ్‌లో సర్రే బ్యాటర్ డామ్ సిబ్లే అత్యధికంగా ట్రిపుల్ సెంచరీ చేశాడు. సిబ్లే 305 రన్స్ స్కోర్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో రెండు సిక్సర్లు, 29 ఫోర్లు ఉన్నాయి. రెండో రోజు మూడు వికెట్లకు 407 రన్స్ వద్ద బ్యాటింగ్ ప్రారంభించిన సర్రే జట్టులో మరో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలతో చెలరేగాడు. డాన్ లారెన్స్ 178, విల్ జాక్స్ 119, సామ్ కర్రన్ 108 రన్స్ చేశారు. కౌంటీ టోర్నీ చరిత్రలో రెండు సార్లు 800 స్కోరు దాటిన జట్టుగా సర్రే రికార్డు క్రియేట్ చేసింది.కౌంటీ చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా యార్క్‌షైర్ జట్టు 887 రన్స్ స్కోర్ చేసింది.1896లో బర్మింగ్‌హామ్‌లో ఆ రికార్డును నెలకొల్పింది.


# మీమ్స్‌పై స్పందించిన కావ్య మారన్.. ఇంతకీ ఏమన్నారంటే..?

కావ్య మారన్  ఈ పేరు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్టు కో-ఓనర్. ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ ఉంటే చాలు.. స్టేడియంలో ఆమె కచ్చితంగా ఉండాల్సిందే. సన్‌రైజర్స్ మ్యాచ్



సందర్భంగా ఆమె చేసే సందడి అంతా ఇంతాకాదు. బౌండరీలు, సిక్సులు, వికెట్లు తీసిన సమయాల్లో ఫుల్ ఎంజాయ్ చేస్తూ.. ఆరెంజ్ ఆర్మీ ప్లేయర్స్‌ను ఉత్సాహపరుస్తుంటారు. చప్పట్లు కొడుతూ.. స్టాండ్స్‌లో గంతులేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఆటలో ఆరెంజ్ ఆర్మీ ఓటమి, గెలుపు సందర్భంగా ఆమె ఎక్స్‌ప్రెషన్స్ ప్రతిసారీ హైలెట్‌గా నిలుస్తుంటాయి. ఈ ఎక్స్‌ప్రెషన్స్‌పై నెట్టింట మీమ్స్ కూడా సందడి చేస్తుంటాయి. ఈ మీమ్స్‌పై కావ్య మారన్ తాజాగా స్పందించారు.ఆట పట్ల తనకున్న మక్కువ వల్లే తాను ఎక్కువగా కెమెరామెన్ దృష్టిలో పడుతుంటానని తెలిపారు. 'క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే మా జట్టు ఆడే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తా. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎక్కడ ఆడినా నేను వెళ్తాను. హైదరాబాద్‌లోనే కాకుండా అహ్మదాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు కూడా వెళుతుంటాను. టీమ్‌కు మద్దతు తెలుపుతాను. ఆ సమయంలో నేను స్టాండ్స్‌లో ఎక్కడో చాలా దూరంలో కూర్చొని ఉంటా. అయినా కెమెరామెన్ నన్ను వదలడు. ఎలాగోలా కనిపెట్టి కెమెరాలో బంధిస్తాడు.

# యువతలో డేంజర్ బెల్స్ మోగిస్తున్న యూరిక్ యాసిడ్ సమస్య.. కింకర్తవ్యమిదే!



భారతదేశంలో యువత ఇప్పుడు ఒక ప్రధానమైన అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. యువతలో యూరిక్ యాసిడ్ సమస్యలు పెరుగుతున్నాయి. యువతలో యూరిక్ యాసిడ్ సమస్య పెరగడం ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతుంది. ఈ సమస్య మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామ లోపం వంటి కారణాలతో వస్తుంది. యువతలో యూరిక్ యాసిడ్ సమస్యలు ప్రస్తుతం మారుతున్న జీవన శైలిలో యువత శారీరకంగా పెద్దగా పని చేయటం మానేశారు. ఎవరు ఏ పని చేసినా మైండ్ తో చేసే పనే తప్పా శరీర పరంగా పెద్దగా కష్టపడే పనే లేకుండా పోయింది. ఫలితంగా అనారోగ్యం యూరిక్ యాసిడ్ రూపంలో పెరుగుతుంది. యూరిక్ యాసిడ్ సమస్య కారణంగా గౌట్, ఆర్థరైటిస్ వంటి ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయి. యూరిక్ యాసిడ్ సమస్యలతో ఈ వ్యాధులు ఈ సమస్యలను ఎదుర్కోవడానికి ముందుగా యూరిక్ యాసిడ్ సమస్యలు రావడానికి గల కారణాల పైన అవగాహన పెంచుకోవడం, నిరోధక చర్యలు తీసుకోవడం అవసరమని వైద్య నిపుణులు భావిస్తున్నారు. శరీరంలో అధికంగా యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం మూత్రపిండాల వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుందని, గౌట్ ఆర్థరైటిస్ వంటి సమస్యలకు కారణమవుతుందని, ఫలితంగా అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని, ఇది మన రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. 5 ఈ కారణాలతోనే యూరిక్ యాసిడ్ సమస్య మన ఆహారపు అలవాట్లు, మన జీవనశైలి ముఖ్యంగా దీనికి కారణమని సూచిస్తున్నారు. విపరీతంగా ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం, జంక్ ఫుడ్స్ తినడం, ఎక్కువగా కూల్ డ్రింక్స్ త్రాగడం, రెడ్ మీట్ తినడం వంటి చెడు ఆహారపు అలవాట్లు యూరిక్ స్థాయిలను పెంచుతాయని చెబుతున్నారు. కొంచెం కూడా వ్యాయామం లేని, కదలని మెదలైన జీవన శైలి మన సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందని చెబుతున్నారు. యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించటానికి ఇలా చెయ్యండి సమతుల ఆహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరంలోని యూరిక్ యాసిడ్ స్థాయిలను నియంత్రించవచ్చని సూచిస్తున్నారు. మన శరీరానికి కావలసినంత వాటర్ ను తీసుకోవడం, మంచి ఆహారపు అలవాట్లను చేసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం యూరిక్ యాసిడ్ స్థాయిలను నియంత్రించడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు . ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించడం ద్వారా చిన్న వయసు నుండి వచ్చే అనేక అనారోగ్య సమస్యల నుండి సులభంగా బయటపడవచ్చు అని సూచిస్తున్నారు.

# రోజుకు ఎన్ని చపాతీలు..ఎప్పుడు తినాలి..? ఇలా చేస్తే ఎన్నో ప్రయోజనాలు..!!



చపాతి ఒక సమయంలో ఉత్తరాది వారు ఎక్కువగా తినేవారు. ఇప్పుడు ఆరోగ్యం కోసం దక్షిణాది లోనూ అన్నం స్థానంలో చపాతీకి ప్రాధాన్యత పెరిగింది. చపాతీల ద్వారా బరువు తగ్గవచ్చని చాలా మంది భావిస్తారు. అయితే, నిర్దేశిత పరిమితిలో.. సరైన సమయంలో చపాతీలను ఆహారంగా తీసు కుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. చపాతీల ద్వారా కావాల్సిన పోషకాలు శరీరానికి అందు తాయని వైద్యులు చెబుతున్నారు. డయాబెటీస్ తో బాధ పడుతున్న వారికి ఇది మంచి ఆహారం. గుండెకు మంచి ఆహారంగా చెప్పుకునే ఈ చపాతీలను సరైన విధానంలో తీసుకుంటే అన్ని ప్రయోజనాలు శరీరానికి అందుతాయి. ఒక మీడియం సైజ్ చపాతీ ద్వారా మనకు సుమారుగా 100 క్యాలరీలు లభిస్తాయి. అలాగే పిండి పదార్థాలు 20 గ్రాములు, ప్రోటీన్లు 4 గ్రాములు, కొవ్వు 1 గ్రాము, ఫైబర్ 3 గ్రాములు లభిస్తాయి. అన్నంను తీసుకుంటే అందులో పిండి పదార్థాలు తప్ప ఇతర పోషకాలు ఉండవు. కనుకనే రాత్రి పూట అన్నంకు బదులుగా చపాతీలను తినాలని వైద్యులు కూడా సూచిస్తుంటారు. చపాతీల్లో విటమిన్లు బి1, బి2, బి3, బి6, బి9, విటమిన్ ఇ, స్వల్ప మొత్తాల్లో విటమిన్ కె ఉంటుంది. చపాతీల ద్వారా మనకు ఐరన్ కూడా లభిస్తుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. చపాతీల్లో మెగ్నిషియం, ఫాస్ఫరస్, పొటాషియం, జింక్, క్యాల్షియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. అయితే ఈ పోషకాలను పొందాలంటే చపాతీలను నూనె లేకుండా కాల్చి తినాలని, లేదంటే వీటిని కోల్పోతామని చెబుతున్నారు. చపాతీల ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు, పోషకాలు లభించాలంటే వాటిని నూనె లేకుండా కాల్చి తినాల్సి ఉంటుంది. ఇక చపాతీల్లో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీంతో పేగుల్లో ఆహారం లేదా మలం కదలిక సరిగ్గా ఉంటుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. కనుక షుగర్ ఉన్నవారికి చపాతీలు ఎంతో మేలు చేస్తాయి. దీంతో డయాబెటి స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గోధుమ పిండిలో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. చపాతీలను తినడం వల్ల అనేక మినరల్స్‌ను పొందవచ్చు. చపాతీలను రాత్రి పూట తింటుంటే అనేక లాభాలను పొందవచ్చని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

# తులసితో డయాబెటిస్ కు చెక్.. కానీ

తులసి.. ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎన్నో ఔషధ గుణాలు కలిగిన ఒక పవిత్రమైన మొక్క. తులసి డయాబెటిస్ నియంత్రణకు సహాయపడుతుందని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఎన్నో ఔషధ గుణాలతో ప్రసిద్ధి చెందిన తులసి మొక్క మన భారతీయ గృహాలలో సాధారణంగా ఉండే ఒక ఔషధ మొక్క. తాజా అధ్యయనాలు ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని సూచిస్తుంది. తులసి ఆకులతో షుగర్ కంట్రోల్




తులసి ఆకులు ఇన్సులిన్ సెన్సిటివిటీ ని మెరుగుపరచే సమ్మేళనాలను కలిగి ఉంటాయని, తులసి ఆకులు కణాల ద్వారా మెరుగైన గ్లూకోస్ గ్రహణానికి సహాయపడుతుందని చెబుతున్నారు. తులసి ఆకులను తీసుకున్నట్లయితే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చని క్రమం తప్పకుండా తులసిని తీసుకోవడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ తగ్గాయని చెబుతున్నారు. తులసిని ఇలా తీసుకుంటే ప్రయోజనం తులసిలో యాంటీ ఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి. ఇవి ఇన్సులిన్ సమర్ధతను మెరుగుపరుస్తాయి అని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. అయితే క్రమ పద్ధతిలో పరిమితంగా మాత్రమే తులసిని తీసుకోవాలని చెబుతున్నారు. తులసి యొక్క ఆక్సిడెంట్ లక్షణాలు ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుండి ప్యాంక్రియాటిక్ బీటా కణాలను రక్షించగలవు అని పరిశోధనలు చెబుతున్నాయి. తులసితో ఇన్సులిన్ ప్రొడక్షన్ ఈ రక్షణ ఇన్సులిన్ స్రావం మరియు పనితీరును మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. తులసిని టీ రూపంలో తీసుకోవడం, ఖాళీ కడుపుతో ప్రతిరోజు రెండు మూడు తులసి ఆకులు నమిలి తినడం, తులసి పొడిని నీటిలో కలుపుకొని తాగడం రోజుకు ఒకటి రెండు సార్లు ఐదు నుంచి పది ఆకుల తులసి టీని తాగడం డయాబెటిస్ ను కంట్రోల్ చేయడానికి ఉపయోగ పడుతుందని చెబుతున్నారు. తులసిని మాత్రమే వాడొద్దు.. ఇలా చెయ్యండి అయితే డయాబెటిస్ బాధితులు కేవలం తులసిని మాత్రమే డయాబెటిస్ కు మందుగా ఉపయోగించకూడదు. డయాబెటిస్ కంట్రోల్ చేయడానికి తులసిని తీసుకోవడానికి ముందు సంబంధిత వైద్య నిపుణులను సంప్రదిస్తే మంచిది. ముఖ్యంగా డయాబెటిస్ బాధితులు డయాబెటిస్ కంట్రోల్ చేసుకోవటానికి జీవన శైలిని మెరుగుపరుచుకోవాలి.

# ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఎన్నిసార్లు తినాలి?




మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఎన్నిసార్లు తినాలి అనేది కూడా తెలిసి ఉండాలి. సాధారణంగా మనిషి ఆరోగ్యంగా ఉండాలి అంటే వారి శరీర పరిస్థితిని బట్టి వారి జీవన శైలిని బట్టి వారు రోజుకు ఎన్నిసార్లు తినాలి అనేది ఆధారపడి ఉంటుంది. కొందరు రోజుకు మూడు సార్లు తినడం మంచిది అని చెబితే, మరికొందరు రోజుకు 4 నుండి 5 సార్లు కొద్దికొద్దిగా తినడం మంచిదని భావిస్తారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు అవసరం ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం ఎంత ముఖ్యమో సమయానికి తినడం, ఎంత తింటున్నామో తెలియడం, ఎన్నిసార్లు తింటున్నామో తెలియడం కూడా అంతే ముఖ్యం. డైటీషియన్లు అభిప్రాయం ప్రకారం ప్రతిరోజు మూడుసార్లు సమతుల్యమైన ఆహారం తినడం చాలా మంచిదని, ఇది చాలామందికి అనుకూలమైన ఆహారమని, ఇది మంచి భోజన నియమం అని చెబుతారు. రోజుకు ఇన్నిసార్లు తింటే మంచిది రోజుకు మూడుసార్లు తినే ఆహారం ఉన్న శక్తి స్థాయిలను నిర్వహించడంలో మన శరీరంలో మెటబాలిజంను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెబుతారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనం మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తుంది. ఇక ఈ మూడు భోజనాలకు మధ్య ఆరోగ్యకరమైన స్నాక్స్ తీసుకోవడం కూడా మంచి ప్రయోజనాలను ఇస్తుంది. పండ్లు లేదా గింజలు వంటి ఆహార పదార్థాలను ఈ మూడు భోజనాల మధ్యలో తీసుకుంటే మంచిదని చెబుతారు. ఖీవఇనీఎఎవనిటవట ఈనీతీ జనీబీ "పాకిస్థాన్ కు చైనా 3.4 బిలియన్ డాలర్ల భారీ సాయం.. భారత్ పై బిగ్ స్కెచ్..!" తక్కువ వ్యవధిలో ఎక్కువ సార్లు తినడం వారికి మేలు ఇక ఆహారాన్ని తీసుకునేటప్పుడు ఒకటేసారి ఎక్కువ మొత్తంలో ఆహారాన్ని తీసుకోకుండా, తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు ఆహారాన్ని తీసుకుంటే బరువు పెరగకుండా ఉండడానికి ఇది దోహదం చేస్తుందని చెబుతారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రిపూట భోజనం సాధారణమైన ఆరోగ్యకరమైన జీవన శైలికి సరిపోతుంది. శ్రమ చేసే వారికి, బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారికి, తక్కువ ఆహారాన్ని, తక్కువ వ్యవధిలో ఎక్కువ సార్లు తినడం మేలు చేస్తుందని చెబుతారు. ఆహారం ఇలా ఉండేలా ఉంటే మంచిది ఇక ఆహారం తీసుకునేటప్పుడు ప్రతి ముద్దను నమిలి తినడం వల్ల ఇది జీర్ణక్రియకు తోడ్పడుతుంది. అంతేకాదు ఆహారం తీసుకునేటప్పుడు ఆకలిగా ఉన్నప్పుడు మాత్రమే ఆహారం తీసుకోవాలని, ఆకలి లేనప్పుడు బలవంతంగా ఆహారం తినడం మంచిది కాదని కూడా చెబుతున్నారు. తీసుకునే ఆహారంలో సమతుల ఆహారం ఉండేలా చూసుకోవాలని కూరగాయలు, పండ్లు, తృణ ధాన్యాలు, లీన్ ప్రోటీన్లు ఆహారంలో ఉండేలాగా చూసుకోవాలని చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ లు, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలని కూడా సూచిస్తున్నారు.

# మందులతో కాదు ఈ ఆహారాలతో హైబీపీ కంట్రోల్ అవుతుంది.. ట్రై చెయ్యండి!



భారతదేశంలో అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ ఒక సాధారణ ఆరోగ్య సమస్య. అయితే దేశంలో హైబీపీ కేసులు పెరుగుతున్న క్రమంలో ఇది తీవ్ర ఆరోగ్య సమస్యగా పరిణమిస్తోంది. హై బీపీని తగ్గించుకోవడం కోసం నిత్యం మనం కొన్ని ఆహారాలను మన డైట్ లో చేర్చడం రక్తపోటు స్థాయిలను నియంత్రించడంలో మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆకుకూరలు మన ఆహారంలో ఆకుకూరలను చేర్చటం మనకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇది మన బీపీని కంట్రోల్ చేస్తుంది. పాలకూర, బచ్చలి కూర, తోటకూర వంటి ఆకుకూరలు పొటాషియం పుష్కలంగా ఉండడంతో, ఎక్కువ సోడియంను తొలగించడానికి దోహదం చేస్తాయి. తద్వారా ఇది మన రక్తపోటును నియంత్రిస్తాయి. ఈ పండ్లతో హైబీపీ కంట్రోల్ మనం తీసుకునే ఆహారంలో కొన్ని రకాల పండ్లు కూడా మన హైబీపీని కంట్రోల్ చేయడానికి ఉపయోగపడతాయి. ముఖ్యంగా మనం తీసుకునే ఆహారంలో బ్లూ బెర్రీలు ఫ్లేవనాయిడ్లను కలిగి ఉండి బీపీని తగ్గించడానికి దోహదం చేస్తాయి. అరటిపండ్లు కూడా పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల మన రక్తపోటు స్థాయిలను గణనీయంగా నియంత్రిస్తాయి. బీపీని కంట్రోల్ చేసే ఆహారాలలో ఇది బెస్ట్ మనం ఆహారంలో తీసుకునే బీట్రూట్ రక్తపోటును నియంత్రించడానికి సహాయపడుతుంది. బీట్రూట్లో నైట్రిక్ ఆక్సైడ్ అధికంగా ఉంటుంది. ఇది రక్తనాళాలను తెరవటంతో పాటు రక్తపోటును తగ్గించడానికి దోహదం చేస్తుంది. బీట్రూట్ జ్యూస్ ను తాగినా, లేక బీట్రూట్ ను సలాడ్లలో భాగంగా తీసుకున్నా రక్తపోటు కంట్రోల్లో ఉంటుంది. ఖనీలివతీవట ఃఎ వెల్లుల్లి, ఓట్స్ తో బీపీకి చెక్ వెల్లుల్లి హైబీపీని తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా చేసుకోవడం రక్తపోటును నియంత్రిస్తుంది. ఓట్స్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మాత్రమే కాక రక్తపోటును కూడా తగ్గిస్తాయి. ఓట్స్ లో బీటా గ్లూకాన్ లు ఉంటాయి. ఇవి రక్తపోటును కంట్రోల్ చేస్తాయి. ఈ నట్స్, సీడ్స్ బెస్ట్ మన ఆహారంలో భాగంగా చేసుకునే సీడ్స్ , నట్స్ కూడా హైబీపీని కంట్రోల్ చేయడానికి దోహదం చేస్తాయి. బాదంపప్పు, వాల్నట్స్ మెగ్నీషియం పుష్కలంగా ఉండటం వల్ల ఇది రక్తపోటును కంట్రోల్ చేస్తుంది. ఇక ఫ్లాక్స్ సీడ్స్ కూడా హైబీపీని కంట్రోల్ చేసే ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ కూడా హైబీపీని కంట్రోల్ చేస్తుంది. 70 శాతం కోకో కలిగిన డార్క్ చాక్లెట్ ఫ్లేవనాయిడ్ లను కలిగి ఉంటుంది. ఇవి రక్తపోటును తగ్గించడానికి దోహదం చేస్తాయి. కనుక పైన పేర్కొన్న ఆహారాలను మన డైట్ లో భాగంగా చేర్చుకుంటే హైబీపీని కంట్రోల్ చేయవచ్చు.




# ప్రభాస్ ఫ్యాన్స్ కు పండగే పండగ

## కన్నప్పలో అదరగొట్టేలా రుద్ర పాత్ర




విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలఅయింది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా మోహన్ బాబు నిర్మించారు. మలయాళ స్టార్ మోహన్ లాల్, బాలీవుడ్ బడా స్టార్ అక్షయ్ కుమార్, రెబల్ స్టార్ ప్రభాస్ ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీ ఎత్తున రిలీజ్ చేయగా ప్రీమియర్స్ ను మంచి స్పందన రాబట్టింది. ముఖ్యంగా తమిళ నటుడు శరత్ కుమార్ ఈ సినిమాలో నాథనాధుడి క్యారక్టర్ లో గంబీరమైన వాయిస్ తో మెప్పించాడు. అలాగే కలెక్షన్ కింగ్ మోహన్ బాబు తనదైన డైలాగ్ డెలివరీతో అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో మహాదేవ శాస్త్రిగా జీవించేసాడు. హీరోయిన్ ప్రీతి ముకుందన్ ఛాలెంజింగ్ పాత్రలో ఒదిగిపోయింది. ఇక మరి ముఖ్యంగా చెప్పుకోవాల్సింది రెబల్ స్టార్ ప్రభాస్. సినిమాలో కీలకమైన 40 నిముషాల ఎపిసోడ్ ను ప్రభాస్ నిలబెట్టేసాడు. ప్రభాస్ డైలాగ్స్ విషయంలో రైటర్ పెన్నుకు పదును పెట్టాడు. ప్రభాస్ పెళ్లి డైలాగ్ కు థియేటర్స్ హోరెత్తాయి. ఇక శివయ్య కు తన కన్ను దానం చేసే సీన్ సినిమాకే హైలెట్ గా నిలిచింది. క్లైమాక్స్ లో తన అద్భుతమైన నటనతో మంచు విష్ణు ప్రేక్షకులతో కంటతడి పెట్టించాడు.

# రూట్ మార్చిన రామ్ పోతినేని



టాలీవుడ్ ట్రెండ్ మారింది. లవ్ స్టోరీస్, యాక్షన్ ఎపిసోడ్లను పక్కకు పెట్టి హారర్, మైథాలజీ, సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాల వైపుగా అడుగులేస్తోంది. హనుమాన్, విరూపాక్ష, పొలిమేర, కల్కి చిత్రాలను ఆడియన్స్ కొత్తగా ఫీలై హిట్స్ ఇవ్వడంతో వీటిపై నిర్మాతలు, దర్శకులు దృష్టి పెడుతున్నారు. ఇక ఇండస్ట్రీలో ఏది నడిస్తే అదే ఫాలో అవ్వాల్సిన పరిస్థితి హీరోలది. ట్రెండ్‌కు తగ్గట్టుగా మారిపోతున్నారు. చిరంజీవి విశ్వంభర, ప్రభాస్.. నిఖిల్ స్వయంభు, తారక్- త్రివిక్రమ్ కథలు సోషియో ఫాంటసీ అండ్ మైథాలజీ రిలేటెడ్ ఫిల్మ్స్ చేస్తున్నారు. మైథాలజీ మాత్రమే కాదు సూపర్ నేచురల్ థ్రిల్లర్ చిత్రాలకు సై అంటున్నారు హీరోస్. ముఖ్యంగా బ్లాక్ మ్యాజిక్, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్టులపై ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. ఇప్పుడు ఈ జోనర్‌లోకి ఎంటర్ కాబోతున్నారు రామ్ పోతినేని. మాస్ ఇమేజ్ కోసం పరుగులెత్తి యూ టర్న్ తీసుకున్న రామ్ ఇప్పుడు అతీంద్రియ శక్తుల కాన్సెప్ట్ కథతో రాబోతున్నాడట. ఈ కథ ఫస్ట్ రానా నుండి చైతూ ఆపై రామ్ దగ్గరకు వచ్చినట్లు తెలుస్తోంది. కిశోర్ అనే కొత్త దర్శకుడి ఛాన్స్ ఇస్తున్నాడట రామ్. ఈ సినిమాను ఆర్కా మీడియా నిర్మిస్తుండగా రానా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆంధ్రా కింగ్ తాలూకాతో బిజీగా ఉన్న ఈ ఎనర్జటిక్ స్టార్ ఈ ఇయర్‌ఎండింగ్ నుండి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నాడని టాక్. మొత్తానికి టాలీవుడ్ మారుతోంది. రొటీన్ మాస్ కథలను పక్కనపెట్టి విభిన్న కథలతో సినిమాలు చేసేందుకు కుర్ర హీరోలు ముందుకు వస్తున్నారు. ఇక ప్రేక్షకుల నుండి రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి.



# గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి

## రష్మిక కొత్త పాత్రలో మైసా మూవీ

'కుబేర'తో తాజాగా విజయాన్ని సొంతం చేసుకున్న రష్మిక ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'మైసా' అనే సినిమాతో రానున్నారు. రవీంద్ర పూలే దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఐదు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. టైటిల్ పోస్ట్‌లో రష్మిక భయంకరమైన అవతారంలో కనిపించి ఆసక్తి పెంచారు. ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. 'ధైర్యం ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం.. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి'..! అంటూ నిర్మాణసంస్థ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో రష్మిక వారియర్‌గా కనిపించనున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. 'నేను ఎప్పుడూ కొత్తది, భిన్నమైనది, ఉత్తేజకరమైన చిత్రాలకు ప్రాధాన్యమిస్తాను. 'మైసా' అలాంటి వాటిలో ఒకటి. నేను ఇంతకు ముందెప్పుడూ పోషించని పాత్ర. ఎప్పుడూ అడుగుపెట్టని ప్రపంచం. ఇప్పటి






వరకూ చేయని వెర్షన్. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే..' అంటూ రష్మిక ఈ సినిమా వివరాలు పంచుకున్నారు. ఇటీవల కాలంలో రష్మిక నటించిన సినిమాల్లో 'సికందర్' మినహా మిగిలినవన్నీ బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. కుబేర కూడా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రస్తుతం ఆమె లైనప్ ఆసక్తికరంగా ఉంది. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తున్నారు. అలాగే, బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానాకు జంటగా 'థామా'తో పలకరించనున్నారు. దీనికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా ఇది రూపొందుతోంది. ఇప్పుడు 'మైసా'ను ప్రకటించారు. వీటి తర్వాత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'పుష్ప2'కు సీక్వెల్లోనూ ఈ బ్యూటీ నటించనున్నారు.

# కుబేర విషయంలో మొదటి విజయం అదే!

: ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన సినిమా కుబేర. నాగార్జున కీలక పాత్రలో నటించిన ఈ సినిమా పాజిటివ్ టాక్ తో బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లను అందుకుంటుంది. ఎప్పుడూ సెన్సిబుల్ లవ్ స్టోరీలను తెరకెక్కించే శేఖర్ కమ్ముల నుంచి కుబేర లాంటి సినిమా చూసి అందరూ ఆశ్చర్యపోయారు. తక్కువ టైమ్ లోనే రూ.100 కోట్ల మార్కెట్ లోకి అడుగపెట్టిన ఈ సినిమా సక్సెస్ విషయంలో శేఖర్ కమ్ముల ఎంతో ఆనందంగా ఉన్నారు. ం ఏ స్తాయిలో ఉందంటే.. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. గతంతో పోలిస్తే ఇప్పుడు అన్ని విషయాల్లోనూ మార్పులొచ్చాయని, ఒకప్పుడు 20 ఏళ్ల వారికి తెలిసే విషయాలు ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యమా అని 10 ఏళ్ల పిల్లలకే తెలిసిపోతున్నాయని, ఇంత ఫాస్ట్ జెనరేషన్ కు తగ్గట్టు కథ రాయగలనా అని కథ మొదలుపెట్టే ముందు తాను అనుకున్నట్టు శేఖర్ కమ్ముల తెలిపారు. అందరినీ మెప్పించే కథ రాయడమే కుబేర విషయంలో తాను అందుకున్న మొదటి విజయమని, కుబేర లాంటి కథతో తెరకెక్కిన సినిమాను తీయడం అంత ఈజీ కాదని, సినిమాలో ఎలాంటి లవ్ స్టోరీ, సాంగ్స్ లేకుండా కథను మూడు గంటల పాటూ నడిపించడమంటే మాటలు కాదని, కేవలం కథతో ఆడియన్స్ ను మెప్పించడం చాలా కష్టమని, కానీ తాను ఆ టెస్ట్ లో కథ విషయంలోనే పాసైనట్టు తెలిపారు శేఖర్. కుబేర కథ చాలా పెద్దదని, కానీ సినిమా పెద్దదైపోతుందని రన్ టైమ్ ను దృష్టిలో పెట్టుకుని కథను వీలైనంత షార్ప్ గా చెప్పే ప్రయత్నం చేశామని, తెలుగు ఆడియన్స్ కు సినిమా అంటే 2 గంటల 45 నిమిషాలు అనే ఫీలింగ్ ఉండిపోయిందని, దాని కంటే మరికొన్ని నిమిషాలు ఎక్కువున్నా పెద్ద సినిమాగా భావిస్తూ రన్ టైమ్ ఎక్కువ అంటున్నారని ఆయన చెప్పారు. కుబేర కథను ఇంతకంటే ఎడిట్ చేయడం తమ వల్ల కాలేదని, రిలీజ్ కు ముందు ఈ విషయంలో చాలా టెన్షన్ పడ్డానని, కానీ రిలీజ్ తర్వాత ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చూసి చాలా సంతోషించినట్టు శేఖర్ కమ్ముల చెప్పారు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**